ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -271 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 6 ఆగస్టు 2025

## పేదరిక నిర్మూలనలో అతిపెద్ద ముందడుగు



దేశానికి ఆదర్శంగా పి-4 కార్యక్రమం

**సాయం కోసం ఎవ్వరినీ బలవంతం చేయొద్దు -అధికారులకు సిఎం చంద్రబాబు సూచన**

అమరావతి, **ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** పేదరిక నిర్మూలనకు రాష్ట్రంలో చేపట్టిన పీ-4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమని చెప్పారు. సచివాలయంలో పీ-4 కార్యక్రమంపై మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమాన్ని ఈ నెల 19 నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు- సీఎం తెలిపారు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదన్నారు. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుంది. బంగారు కుటుంబాలకు కావాల్సింది భావోద్వేగాలతో కూడిన బంధం, చేయూత మాత్రమే. సీఎస్ఆర్ నిధులతో బిల్ గేట్స్‌తో పాటు- వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి మించి కుటు-ంబాలను ఆదుకోవడటమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమం చేపట్టాం. ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు చేస్తున్నాం. బంగారు కుటు-ంబాలను ఆదుకోవడంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా స్వచ్ఛందంగానే జరుగుతుంది. ఎక్కడా ఎవరినీ బలవంతం చేయొద్దని అన్నారు. మంచి కార్యక్రమాలు అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తారు. ప్రజల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తారు. మిగతాది 2లో...

## కూటమి పాలనలో అవినీతి పేట్రేగింది

### చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై జగన్ ఫైర్

లిక్కర్, ఇసుక, అమరావతి పనుల్లో భారీగా కమీషన్లు : ఆరోపణ

ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం

అధికార దుర్వినియోగంపై న్యాయవాదులు పోరాడాలని పిలుపు

త్వరలో ప్రత్యేక మొబైల్ యాప్ తీసుకువస్తామన్న జగన్



అమరావతి, **ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో అవినీతి విచ్చలవిడిగా పేట్రేగిపోయిందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యంగా మద్యం వ్యాపారం, అక్రమ ఇసుక తవ్వకాలు, అమరావతి భూముల వ్యవహారాల్లో అవినీతి తారస్థాయికి చేరిందని ఆయన మంగళవారం విమర్శించారు. మిగతాది 2లో...

## 24 గంటల్లో సుంకాలు పెంచుతా...

భారత్ కు మరోసారి ట్రంప్ వార్నింగ్

భారత్‌పై భారీ సుంకాల పెంపునకు ట్రంప్ సన్నాహాలు

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలుపై ఆగ్రహం



భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా, భారత్‌పై విధిస్తున్న సుంకాలను వచ్చే 24 గంటల్లో మరింత పెంచబోతున్నట్లు ఆయన మంగళవారం నాడు ప్రకటించారు. మిగతాది 2లో...

## వివేకా హత్య కేసులో ముగిసిన దర్యాప్తు


### సుప్రీం కోర్టుకు తెలిపిన సిబిఐ అధికారులు



న్యూఢిల్లీ, **ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** వైఎస్ వివేకా హత్యకేసుపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీబీఐ అధికారులు కోర్టు ముందు తమ వాదనలు వినిపించారు. ఈ కేసులో దర్యాప్తు ముగిసిందని సీబీఐ అధికారులు సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. వివేకా హత్య కేసులో ఇంకా విచారించాల్సిందేమీ లేదని తేల్చిచెప్పారు. మిగతాది 2లో...

## రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన స్థానికేతరుడా?

తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ



2లో.

## ఈవీఎంలు వద్దు...

బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరపండి

బీహార్ తో దీనిని ప్రారంభించండి

కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీలో బిఆర్ఎస్ డిమాండ్




న్యూఢిల్లీ, **ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** భారతదేశంలో ఇకపైన జరిగే ప్రతి ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరగాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు . బ్యాలెట్ విధానాన్ని బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేటీఆర్ కోరారు. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ నేతల బృందం కేటీఆర్ నేతృత్వంలో ఈసీ అధికారులతో సమావేశం అయింది. మిగతాది 2లో...



## నేడు ఏపి కేబినేట్ సమావేశం

### ఉచిత బస్సు పథకంపై చర్చ

అమరావతి, **ఆగస్టు 05 :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం జరగనుంది.. సచివాలయంలో జరిగిన ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలపనుంది.. మిగతాది 2లో...

## హజ్ - 2025 కు విజయవాడను ఎన్నుకున్న యాత్రికులకు రూ.72 లక్షలు మంజూరు.

ఇచ్చిన హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం.

2026 హజ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

విజయవాడ నుండి వెళ్లే వారందరికీ రూ. లక్ష ఆర్థిక సాయం.

రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.



2లో.

## స్మార్ట్ కార్డ్ తరహాలో రేషన్ కార్డు

25 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

రేషన్ షాపులు ద్వారా జీసీసీ ఉత్పత్తులు అందించే యోచన

వయసుపైబడ్డ వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దకే సరుకులు

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



2లో.

# పేదరిక నిర్మూలనలో అతిపెద్ద ముందడుగు

**(మొదటి పేజి తరువాయి)**

గతంలో జన్మభూమి, శ్రమదానం ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదే విధంగా విమర్శించారు. కొందరికి ఆర్థిక వనరులున్నా పేదల్ని ఆదుకోవడానికి మనసు రాదు. కొందరికి మనసు ఉన్నా సమయం ఉండకపోవచ్చు. అలాంటి వారిని గుర్తించాలి. ఇవాళ బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే.. రేపు మార్గదర్శి అవ్వొచ్చు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందుకుంటూనే బంగారు కుటుంబాలకు పీ-4 ద్వారా అదనపు సాయం అందుతుంది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలను కలిసి వారిలో ఆలోచనలు రేకెత్తించాలని అన్నారు. ఇప్పటి వరకు 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తయింది. 1,03,938 మందిని మార్గదర్శులుగా గుర్తించాం. రాష్ట్రవ్యాప్తంగా 10లక్షల కుటు-ంబాలకు ఉన్న అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాం. 11 ప్రశ్నలతో వివరాలు నమోదు చేసి ఏఐతో విశ్లేషించాం. 31 శాతం మంది ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, 22 శాతం మంది వైద్య చికిత్సలకు సంబంధించి, 9 శాతం మంది తమ చిన్న చిన్న వ్యాపారాలను మరింత పెంచుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. బంగారు కుటు-ంబాలను దత్తత తీసుకోవడంతోపాటు- గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు కొందరు ముందుకొస్తున్నారు. నేను 250 కుటు-ంబాలను దత్తత తీసుకోవడంతోపాటు- ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాంఅని సీఎం చంద్రబాబు తెలిపారు.ద

# నేడు ఎపి కేబినేట్ సమావేశం

**(మొదటి పేజి తరువాయి)**

ముఖ్యంగా.. ఎంతోకాలంగా ఎదురుచూస్తోన్న మహిళలకు ప్రభుత్వం శుభవార్త చెప్పబోతోంది.. కేబినెట్ సమావేశంలో మహిళల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై చర్చించబోతున్నారు.. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి అధికారికంగా పేరు ఖరారు చేసి ప్రకటన చేయనుంది ప్రభుత్వం.. పలు సంస్థలకు భూ కేటాయింపులపై కూడా చర్చించనున్నారు.. నాలా చట్ట సవరణకు సంబంధించి కేబినెట్ లో చర్చిస్తారు.. ఎల్ఆర్ఎస్.. బీఆర్ఎస్ పై కూడా కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది.. సీఎం అండ్ టీం సింగపూర్ టూర్ పై చర్చించనుంది మంత్రివర్గం.. ఇక, కేబినెట్ సమావేశం తర్వాత తాజా పరిణామాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించనున్నారు.. లిక్కర్ కేసులు.. నగదు బయట పడడం.. అరెస్ట్ లకు సంబంధించి కూడా చర్చించనున్నారు.. కాగా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని మహిళలందరికి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు సిద్ధమైంది కూటమి ప్రభుత్వం.. దీనిపై ఇప్పటికే అధికారులు ఎ-క్సై-÷-సజ్ పూర్తి చేశారు.. అంతర్రాష్ట్ర పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడి-కై-నా మహిళలు జీరో టికెట్‌తో ఉచితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకుంటు-న్నారు.. మహిళా ఉద్యోగులు, ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం కల్పించబోతున్నారు.. మొత్తం బస్సుల్లో 74 శాతం బస్సులున్న పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ-ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సుల్లో ఈ ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని ఇప్పటికే రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు.. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించినా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుంది.

# 24 గంటల్లో సుంకాలు పెంచుతా...

**(మొదటి పేజి తరువాయి)**

ఇప్పటికే ఆగస్టు 7 నుంచి 25 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించినప్పటికీ, ఆ రేటును మరింత పెంచుతానని స్పష్టం చేయడం ఇరు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను పెంచేలా ఉంది.

సీఎన్‌బీసీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్‌లో అత్యధిక సుంకాలు ఉన్నాయి. మేము భారత్‌తో చాలా తక్కువ వ్యాపారం చేస్తాం. ముందు 25 శాతానికి అంగీకరించాం, కానీ రాబోయే 24 గంటల్లో దాన్ని గణనీయంగా పెంచాలని నేను భావిస్తున్నాను" అని ట్రంప్ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. రష్యా యుద్ధానికి భారత్ తన చమురు కొనుగోళ్ల ద్వారా ఆర్థికంగా సహకరిస్తోందని ఆయన ఆరోపించారు.విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఔషధాలపై 250 శాతం సుంకాలు!ఈ క్రమంలో ట్రంప్ మరో సంచలన ప్రకటన కూడా చేశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఔషధాలపై (ఫార్మాస్యూటికల్స్) భారీగా సుంకాలు విధించనున్నట్లు మంగళవారం వెల్లడించారు.అమెరికాలో ఔషధాల తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సీఎన్‌బీసీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఈ సుంకాలు క్రమంగా 250 శాతం వరకు చేరవచ్చని స్పష్టం చేశారు. మొదట తక్కువ శాతంతో సుంకాలు ప్రారంభమవుతాయని, ఏడాది నుంచి 18 నెలల వ్యవధిలో వీటిని 150 శాతం, ఆ తర్వాత 250 శాతానికి పెంచుతామని ట్రంప్ వివరించారు. "మా దేశంలోనే ఫార్మాస్యూటికల్స్ తయారు కావాలని మేము కోరుకుంటున్నాం" అని ఆయన అన్నారు. అంతేకాకుండా, రాబోయే వారం రోజుల్లో విదేశీ సెమీకండక్టర్లు, చిప్‌లపై కూడా సుంకాలు విధిస్తామని తెలిపారు.

# వివేకా హత్య కేసులో ముగిసిన దర్యాప్తు

**(మొదటి పేజి తరువాయి)**

తమ తరఫు నుంచి దర్యాప్తు ముగిసిందని తెలిపారు సీబీఐ అధికారులు. న్యాయస్థానం దర్యాప్తుపై ఏమైనా ఆదేశాలిస్తే వాటిని అమలు చేస్తామని పేర్కొన్నారు. జస్టిస్ ఎంఎం సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు వివేకా హత్య కేసు విచారణ జరిగింది. వివేకా కుమార్తె సునీత తరఫు సీనియర్ కౌన్సిల్ వేరే కోర్టులో ఉన్నందున జూనియర్ లాయర్ విచారణ పాస్ ఓవర్ కోరారు. ఒకవేళ సుప్రీంకోర్టు ఆదేశిస్తే వివేకా హత్య కేసును తదుపరి కొనసాగిస్తామని సీబీఐ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ధర్మాసనానికి సీబీఐ అధికారులు వివరించారు.




# ఈవీఎంలు వద్దు...

**(మొదటి పేజి తరువాయి)**

దేశంలో ఎన్నికల వ్యవస్థ, నూతన సంస్కరణలు, ఎన్నికల నియమావళి వంటి అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగానే టిఆర్ఎస్ పార్టీని సమావేశానికి ఆహ్వానించింది. కేంద్ర ఎన్నికల సంఘంతో జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ బృందం పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేసింది.. భారత్ లో ఈవీఎంల ద్వారా జరుగుతున్న ఎన్నికల పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో, ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. నవంబర్ లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు- కేటీ-ఆర్ తెలిపారు. అంతేకాదు ఎన్నికలు వస్తే చాలు రాజకీయ పార్టీలు అడ్డగోలు వాగ్దానాలు చేస్తున్నాయని, వాటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోతే చర్యలు కూడా తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని బిఆర్ఎస్ కోరింది. మరోపక్క బీహార్ లో జరిగిన ఓట్ల జాబితా సమగ్ర సర్వేపై కూడా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించినట్టు- తెలిపారు. ముఖ్యంగా ఓట్లు-తొలగించేటటువంటి ప్రక్రియను బూత్ స్థాయి నుంచి అన్ని రాజకీయ పార్టీలను అఖిలపక్షంగా ఏర్పాటు- చేసి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనర్హుడికి ఒక ఓటు- వచ్చినా సరే, ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు- కోల్పో వద్దన్నారు కేటీ-ఆర్. ఎన్నికల గుర్తులు నుంచి తమ పార్టీ సింబల్ అయిన కార్ గుర్తును పోలి ఉన్న గుర్తులను తక్షణమే తొలగించాలని.. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో పోలివున్న గుర్తులవల్ల తమ పార్టీ అభ్యర్థులు నష్టపోయారని కేటీఆర్ గుర్తు చేశారు..

# కూటమి పాలనలో అవినీతి పేట్రేగింది

**(మొదటి పేజి తరువాయి)**

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన పార్టీ లీగల్ సెల్ న్యాయవాదుల సమావేశంలో జగన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపులు ప్రమాదకర స్థాయికి చేరాయని అన్నారు. హైదరాబాద్, బెంగళూరు నగరాలతో పోలిస్తే అమరావతి రాజధాని పనులను రెట్టింపు ధరకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం యూనిట్ విద్యుత్‌ను రూ. 2.49కి కొనుగోలు ఒప్పందాలు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రూ. 4.60కి కొనుగోలు చేస్తోందని విమర్శించారు.

ప్రభుత్వం సూపర్-6, సూపర్-7 వంటి మోసపూరిత పథకాలతో ప్రజలను మోసం చేసినట్టే, న్యాయవాదులను కూడా వంచిస్తోందని జగన్ అన్నారు. ప్రతి గ్రామంలో బెల్టు షాపులు నడుస్తున్నాయని, పర్మిట్ రూమ్‌లను అక్రమంగా అమ్ముకుంటున్నారని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. చిన్న పరిశ్రమ పెట్టాలన్నా లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని, కొందరు పోలీసు అధికారులే జూదం క్లబ్‌లకు అండగా నిలుస్తున్నారని జగన్ విమర్శించారు.ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయం, ధర్మం కనుమరుగయ్యాయని, ప్రతిపక్షంలో ఉన్నారనే కారణంతో ఎలాంటి ఆధారాలు లేకుండానే వ్యక్తులను జైలుకు పంపుతున్నారని జగన్ అన్నారు. బెదిరింపులతో తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారని, ఇది సిగ్గుచేటైన రాజకీయ సంస్కృతి అని అభివర్ణించారు. అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా న్యాయవాదులు ముందుండి పోరాడాలని, బాధితులకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.త్వరలోనే ఓ కొత్త మొబైల్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు జగన్ ప్రకటించారు. ప్రజలు తమకు జరిగిన అన్యాయాలను ఆధారాలతో సహా ఈ యాప్‌లో నమోదు చేయవచ్చని, ఈ సమాచారాన్ని డిజిటల్ లైబ్రరీలో భద్రపరిచి అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ హయాంలో న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ. 100 కోట్లు కేటాయించామని, లా నేస్తం పథకం ద్వారా యువ న్యాయవాదులను ఆదుకున్నామని జగన్ గుర్తుచేశారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# హజ్ - 2025 కు విజయవాడను ఎన్నుకున్న యాత్రికులకు రూ.72 లక్షలు మంజూరు.

**ఇచ్చిన హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం.**

**2026 హజ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.**

**విజయవాడ నుండి వెళ్లే వారందరికీ రూ. లక్ష ఆర్థిక సాయం.**

**రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

అమరావతి, **ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :**

హజ్- 2025 కు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను మొదటి ప్రాధాన్యతా కేంద్రంగా ఎన్నుకుని, తరువాత తక్కువ యాత్రికుల కారణంగా విజయవాడనుండి విమాన సర్వీసు రద్దు కాగా హైదరాబాద్ నుండి హజ్ యాత్రను పూర్తి చేసుకొని



వచ్చిన యాత్రికులకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. హజ్ యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గతేడాది ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ఎన్నుకున్న 72 మంది యాత్రికులకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ఇచ్చిన హామీ మేరకు రూ.72 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మంజూరు చేసింది. 2026 హజ్ కి వెళ్లే వారికి కూడా విజయవాడ నుండి హజ్ కి వెళ్తే రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తామని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. హజ్ కు వెళ్లే వారు ఈనెల 7వ తేదీలోగా తమ దరఖాస్తులను ఆన్లైన్లో పూరించుకోవాలని, విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఎంచుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఎంబార్కేషన్ సెంటర్ మార్పు చేసుకొని విజయవాడ ను ఎంచుకోవాలని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని హజ్ యాత్రికులను మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# స్మార్ట్ కార్డ్ తరహాలో రేషన్ కార్డు

**25 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ**

**రేషన్ షాపులు ద్వారా జీసీసీ ఉత్పత్తులు అందించే యోచన**

**వయసుపైబడ్డ వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దకే సరుకులు**

**పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

విశాఖపట్నం, **ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** రాష్ట్రంలో మరింత కొత్తగా.. వినూత్నంగా రేషన్ కార్డ్స్ అందిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ సరుకులను ఆగస్టు 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తామని విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

ఏటీ-ఎం కార్డు సైజులో నూతన రేషన్ కార్డులు ఉండబోతున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కొన్ని మ్యాపింగ్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తున్నట్లు- పేర్కొన్నారు. రేషన్ షాపులు ద్వారా జీసీసీ ఉత్పత్తులు అందించే నిర్ణయం తీసుకున్నట్లు- చెప్పారు. నాలుగు కోట్ల మందికి రేషన్ సరుకులు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్యాస్ రాయితీ విషయంలో కూడా డిజిటల్ వారెంట్ కూపన్ను అందిస్తున్నట్లు- తెలిపారు. మూడు రోజులు ఉత్తరాంధ్రలో పర్యటించినట్లు- మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు- చెప్పారు. నెలలో 15 రోజుల పాటు- రేషన్ సరుకులు అందజేస్తామని పేర్కొన్నారు. 65 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటివద్దకే సరకులు అందిస్తామని వివరించారు. ఎండీయూ వాహనాలు తొలగింపు విషయంలో సుమారు రూ.200 కోట్లు నష్టం జరిగిన ముందుకు వెళ్ళామని నాందెడ్ల మనోహర్ చెప్పుకొచ్చారు. దీపం పథకం ద్వారా ఫేజ్-1లో కోటి మందికి, ఫేజ్ 2లో 95 లక్షల మందికి సబ్సిడీ అందించినట్లు- తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నట్లు- తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశాని ఆయన స్పష్టం చేశారు. అలాగే.. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెట్టినట్లు-, చట్టంలో మార్పులు కూడా తీసుకొచ్చినట్లు- ఆయన వివరించారు. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో తప్పు ఎవరు చేసినా కఠిన చర్యలు ఉంటాయని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నెలలో 15 రోజుల పాటు- రేషన్ సరకులు అందజేస్తున్నామని చెప్పారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30 వరకు ఇంటివద్దే అందిస్తున్నామని వివరించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో మంత్రి మాట్లాడారు. ప్రజలకు మరింత మెరుగ్గా రేషన్ సరకులు అందజేసేందుకు సుమారు రూ.200 కోట్ల భారం పడినా ముందుకు వెళ్లాం. దీపం పథకం ద్వారా ఫేజ్-1లో కోటి మందికి ఫేజ్-2లో 95 లక్షల మందికి సబ్సిడీ అందించాం. ఫేజ్-3లో సాంకేతిక సమస్యలను అధిగమించి అర్హులందరికీ పథక ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటాం. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు- మా దృష్టికి వచ్చింది. దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశాం. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలుంటాయి. లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ జమ కాకపోతే అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలి. ఆగస్ట్ 25 నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తాం. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెంచాం.. చట్టంలోనూ మార్పులు తీసుకొచ్చాం. లీగల్ మెట్రాలజీ శాఖ కార్యకలాపాలను పెంచాం. గత సీజన్‌లో రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం సేకరించి రూ.12వేల కోట్లు- చెల్లించాం. ఏఐ సహాయంతో పౌర సరఫరాల శాఖలో డేటా అనాలసిస్ చేస్తున్నాం.. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నాం. ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో పనిచేయాలని నాదెండ్ల మనోహర్ అన్నారు.

# రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన స్థానికేతరుడా?

**తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ**

**ప్రభుత్వ తీరును ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్**

**తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం**

న్యూఢిల్లీ,, **ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :**

తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసంది. దీనిపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్



నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని వాదనల సందర్భంగా సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. కోటా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులకు స్థానికత వర్తించదంటే ఎలా? ఒక విద్యార్థి తెలంగాణలో పుట్టి పెరిగి.. రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన కోటా వర్తించదంటే ఎలా? ప్రతి విద్యార్థి 371డి అధికరణం గురించి తెలుసు కోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయి. నిరక్ష రాస్యులైన తల్లిదండ్రులు ఉంటే.. 8వ తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్న విధంగా మీ వాదనలు ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

పలు రాష్ట్రాల్లోస్థానిక వ్యవహారం పలు విధాలుగా ఉందని రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. పలు రాష్ట్రాల్లో స్థానికత వ్యవహారం పలు విధాలుగా ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ. అస్సాంలో 7 సంవత్సరాల నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పేద, మధ్యతరగతి వాళ్లకు జరుగుతున్న ఉపయోగాన్ని విస్తృత కోణం నుంచి చూడాలని, అందుకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని సింఘ్వీ కోరారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 6 ఆగస్టు 2025

# నంద్యాల లయన్స్ క్లబ్, ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం: ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మల్లీశ్వరి.

ముర్రు పాలలో రోగనిరోధక శక్తి ఉంటుంది: డాక్టర్ లలిత, జిల్లా వైద్య విధాన పరిషత్తు కోఆర్డినేటర్.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం: డాక్టర్ పద్మజ, ప్రభుత్వాసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి.

బిడ్డ పుట్టిన గంట లోపు తల్లిపాలు తాపించాలి: డాక్టర్ అరుణ జ్యోతి, ప్రభుత్వాసుపత్రి చిన్నపిల్లల విభాగాధిపతి.

తల్లిపాల విశిష్టతపై కరపత్రాలు ఆవిష్కరణ. -నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో బ్రెడ్లు, పండ్లు పంపిణీ.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 05:**
నంద్యాల లయన్స్ క్లబ్,ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం సంయుక్త నిర్వహణలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి తల్లీ బిడ్డల ప్రత్యేక విభాగంలో మంగళ వారం తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన,నెరవాటి ఆసుపత్రి నిర్వాహకులు, నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణ కుమారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరంటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి,జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ లలిత,నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,ఆసుపత్రి స్త్రీ,ప్రసూతి విభాగ అధిపతి డాక్టర్ పద్మజ, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ అరుణ జ్యోతి, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు పాల్గొని తల్లిపాల విశిష్టతపై రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరణ చేశారు.తల్లిపాల విశిష్టత పై డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ లలిత,డాక్టర్ నెరవాటి అరుణ కుమారి,డాక్టర్ పద్మజ ,డాక్టర్ అరుణ జ్యోతి, డాక్టర్ వసుధ, డాక్టర్ నర్మద, డాక్టర్ లక్ష్మీ సౌజన్య,గర్భవతులకు,చంటి బిడ్డల తల్లులకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ప్రసవించిన వెంటనే వచ్చే ముర్రుపాలలో బిడ్డలకు మంచి రోగ నిరోధక శక్తి కలిగి ఉంటుందని అన్నారు. ముర్రుపాలు తప్పనిసరిగా తాపించాలని అన్నారు. బిడ్డలకు పాలిచ్చిన తల్లులకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. ఆరోగ్యవంతమైన శిశువు ఎదుగుదలకు తల్లిపాలను మించిన మరొక ఆహారం సృష్టిలో ఏదీ లేదన్నారు.చంటి బిడ్డ తల్లులకు, గర్భవతులకు, ఆసుపత్రి వార్డులో ఉన్న బాలింతలకు 200 మందికి బ్రెడ్, పండ్లు నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ అరుణకుమారి సౌజన్యంతో పంపిణీ చేశారు.లయన్స్ క్లబ్ తరపున డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ లలిత, డాక్టర్ పద్మజ,డాక్టర్ అరుణ జ్యోతి, డాక్టర్ అరుణ కుమారి లను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ సహదేవుడు,ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మజ, చిన్నపిల్లల విభాగ అధిపతి డాక్టర్ అరుణ జ్యోతి, నెరవాటి ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ అరుణకుమారి, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు , కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, లయన్స్ క్లబ్ సభ్యులు కసెట్టి చంద్రశేఖర్, బాబురావు, చంద్రమోహన్, మామిళ్ల నాగరాజు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధించాలి.

ఆగస్టు 12వ తేదీన కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళా.

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు, 05:**జాబ్ మేళా ద్వారా యువత మెరుగైన ఉపాధి పొంది జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆగస్టు 12న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10 ప్రైవేటు కంపెనీలు జి.ఆర్.ఇన్ స్ట్రాచేమే ప్రైవేటు లిమిటెడ్, హిటిరో లాబ్, ఎస్.వి.ఎల్ మాన్ పవర్సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్, డిక్షన్ ప్రైవేటు లిమిటెడ్, పెన్నార్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, ఆర్ఎస్ ట్రాన్స్ మిషన్ ప్రైవేటు లిమిటెడ్, టి.వి.ఎస్ ఇండియా లిమిటెడ్,ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, వెంకట్ హ్యూమన్ సర్వీసెస్ లిమిటెడ్ మరియు ఎల్ %ఙ% టి కన్స్ట్రక్షన్ చెందిన హెచ్ ఆర్ ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే యువతీ, యువకులు 5వ తరగతి, పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బిటెక్, డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ మరియు పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. కావున జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగము చేసుకోగలరని తెలియజేశారు. వీటికి సంబంధించిన ఇతర వివరముల కొరకు 9182217075, 9951400588 నెంబర్లకు లేదా **naipunyam.ap.gov.in** సంప్రదించాలని తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డిఆర్డిఎ పిడి శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన ప్రమాణాలను పాటించండి.

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు, 05:** ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన ప్రమాణాలను పాటించి కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను పొందాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వైద్యాధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ క్వాలిటీ అస్యూరెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జాతీయ స్థాయి సర్టిఫికేషన్ కార్యక్రమానికి గాను కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో ఉత్తమ ప్రమాణాలు పాటించిన 57 ఉత్తమ ప్రమాణాలు పాటించిన ఆసుపత్రాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ఆసుపత్రులలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించినందుకు గాను ప్రోత్సాహకం రూపంలో సంవత్సరానికి మూడు లక్ష రూపాయల చొప్పున మూడు సంవత్సరాలకు తొమ్మిది లక్షల రూపాయలు అందజేస్తారని చెప్పారు. ఈ నగదుతో సదరు ఆసుపత్రులలో ఇంకా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. అదేవిధంగా మిగిలిన ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా సదరు సదుపాయాలను ఏర్పాటు చేసుకొని వారు కూడా కేంద్ర ప్రభుత్వం నుండి నగదు లబ్ధిని పొందేలా కృషి చేయాలన్నారు.అనంతరం సదుపాయాల ఏర్పాటు కోసం కృషిచేసిన 16 మంది వైద్య సిబ్బందికి కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు.సమావేశంలో డిఎంహెచ్ఓ వెంకటరమణ, జిజిహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, డిసిహెచ్ఎస్ లలితా, డిపిఎంఓ అంకిరెడ్డి, డిస్టిక్ క్వాలిటీ కన్సల్టెంట్స్ లక్ష్మణ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# గని గ్రామంలో "డ్రగ్స్ వద్దు బ్రో "అనే కార్యక్రమం ఏర్పాటు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం.

డ్రగ్స్, గంజాయి రహిత సమాజమే లక్ష్యం... సమిష్టి కృషితో డ్రగ్స్ ను పారద్రోలుదాం.




**ఆంధ్ర ప్రగతి గడివేముల ఆగస్టు 05:**గడివేముల మండలం గని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మాదకద్రవ్యాల అవగాహన సదస్సు నిర్వహించిన గడివేముల సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి మరియు ఈగల్ సిబ్బంది. ఈగల్ టీం ఐజి అకే.రవికృష్ణ ఆదేశాలమేరకు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా జిల్లా నోడల్ ఆఫీసర్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏన్.యుగంధర్ బాబు వారి సూచనలతో నంద్యాల జిల్లాలోని గడివేముల మండలం, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మాదక ద్రవ్యాల అవగాహన సదస్సు ను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్సై నాగార్జున రెడ్డి మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల వాడకంనుంచి దూరంగా ఉండాలని విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, సిగరెట్లు త్రాగడం, మందు త్రాగడం, ఫ్యాషన్ గా ఫీల్ అవుతారు అది నాశనానికి తొలిమెట్టు అది చివరకు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కావడమే కాకుండా జీవితం నాశనం అవుతుంది.వాటికి దూరంగా ఉండాలని, విద్యార్థులకు సూచించడం జరిగినది.మరియు ప్రతి స్కూల్ లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని వారు తమ స్కూల్ లో మరియు చుట్టూ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ మరియు మాదకద్రవ్యాల గురించిన సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు గాని , వాట్సాప్ నెంబర్ 8977781972 కు సమాచారం ఇవ్వాలని అలా ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ తో పాటు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ విజయ ఈగల్ టీం సిబ్బంది ప్రసాద్,మనోహర్ లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లను పెట్టవద్దు.. ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దు.

కూటమి ప్రభుత్వానికి స్మార్ట్ మీటర్ల గండం మొదలైంది.

- ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఆఫీస్ ముందు ధర్నా.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 05:**
నంద్యాల పట్టణంలోని విద్యుత్ కార్యాలయము ఎస్ ఈ ఆఫీసు ముందు ధర్నా చేసి ఎస్ ఈ సుధాకర్ కుమార్ కి వినతి పత్రం అందించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పుల్లా నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముస్లిం జేఏసీ నాయకులు అబులైజ్, వెల్ఫేర్ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అన్సర్ భాష, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ వై డి ప్రసాద్, క్రిస్టియన్ జేఏసీ తెలుగు ఉభయ రాష్ట్రాల కన్వీనర్ మన్యం జానయ్య, సిఐటియు కార్యదర్శి కే యం డి గౌస్ మాట్లాడారు. అదేవిధంగా ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిరంతరం పేద ప్రజల తరపున పోరాటం చేసే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి పార్టీ అనుచరుడు ఆదాని కోసమే ఈ యొక్క స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని స్మార్ట్ మీటర్ల బిగింపుకు ప్రభుత్వం ఎటువంటి ప్రత్యేకమైన జీ.వో తీసుకుని రాలేదని విద్యుత్ అధికారులు కూడా ఎక్కడ చెప్పడం లేదని వారు అన్నారు. ఈరోజు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆదానికి డబ్బులు కూడా పెట్టడం కోసమే ఈ యొక్క స్మార్ట్ మీటర్లను బిగిస్తుందని వారు అన్నారు. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 35 వేల కోట్ల రూపాయలు ప్రజల పైన భారం వేసిందని ఆరోజు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి పార్టీ గగ్గోలు పెట్టి మేము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని అన్నారు,ఇంకా చంద్రబాబునాయుడు తనయుడు లోకేష్ బాబు అయితే స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పాడు, ఆరోజు చెప్పిన మాట ఇప్పుడు ఏమైందని వారు అన్నారు. ఈరోజు ఎక్కడ దాక్కున్నారని వారు అన్నారు.కేవలం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోనే 2771కోట్ల రూపాయల పైన విద్యుత్తుల భారాలు ప్రజల పైన మోపింది ఈ కూటమి ప్రభుత్వం, మళ్లీ ఇప్పుడు 1271 కోట్ల రూపాయలు ప్రజల పైన భారం మోపరానికి రెడీ అయింది. ఇప్పుడు చెప్పాలా చంద్రబాబు నాయుడు అధికారం ఉన్నప్పుడు ఏం చెప్పినారు,అధికారంలోకి వచ్చినాక ఇప్పుడు ప్రజల పైన విద్యుత్ బారాలు వేయడమే మీ పని పెట్టుకున్నారు. కాబట్టి గతంలో చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచి తొమ్మిది సంవత్సరాలు అధికారం లేకుండా పోయినాడు, మళ్లీ ఇప్పుడు కూడా స్మార్ట్ మీటర్ల గండం చంద్రబాబునాయుడు కి మొదలైందని వారు అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వార్డులలో తిరుగుతూ ఉంటే ప్రజలు స్మార్ట్ మీటర్ల వలన పడుతున్న విద్యుత్ చార్జీల భారం అంతా ఇంతా కాదు, వందలు వచ్చే విద్యుత్ బిల్లులు, వేల రూపాయలు వస్తుందని ఈ స్మార్ట్ మీటర్లు మాకు వద్దు బాబోయ్ అంటున్నారు. ఈ పాత మీటర్లు బాగానే పని చేస్తున్నాయి కదా పాత మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు పెట్టాల్సిన అవసరం ఏముంది అంటే ఈ యొక్క కూటమి ప్రభుత్వం, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండు ప్రభుత్వాలు కలిపి ఆదానికి ప్రజల సొమ్మును ఉచితంగా దోచిపెట్టడానికి ఈరోజు ఉన్నాయని వారు అన్నారు. కాబట్టి తక్షణమే స్మార్ట్మీటర్లను రద్దు చేయాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను తీసివేయాలని, అదే పెంచబోయే విద్యుత్ చార్జీలను పూర్తిగా రద్దు చేసి ప్రజల మేలు చూడాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో, ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు డి లక్ష్మణ్, నాయకులు వెంకటలింగం, జైలాం,సుబ్బారావు, సాయి, హరి,వెంకటేశ్వర్లు, రానా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బంగారు కుటుంబంలోని విద్యార్థికి రూ. 50వేలు ఆర్థిక సాయం అందజేసిన జిల్లా కలెక్టర్.

సమాజంలో ఆర్థికంగా వృద్ధి చెందినవారు దిగువ స్థాయిలో ఉన్న వారిని దత్తత తీసుకోవాలి.

స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయ మార్గదర్శులను అభినందించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 05:**
పి4 లో పథకం అమలులో భాగంగా... నంద్యాల పట్టణం బొమ్మల సత్రం క్రాంతి నగర్ కు చెందిన పేద బంగారు కుటుంబంలోని విద్యార్థి ఎం.రోహన్ సాయి వార్షిక హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.50వేల ఆర్థిక సాయం అందజేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులైన మార్గదర్శుల దాతృత్వం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో ఆర్థిక సహాయం చెక్కును తల్లిదండ్రుల సమక్షంలో కలెక్టరు చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు.



నంద్యాల పట్టణం బొమ్మల సత్రం క్రాంతి నగర్ కు చెందిన మారెళ్ళ రమేష్ నాయుడు, మారెళ్ళ లక్ష్మీ దపతులకు ఇద్దరు పిల్లలు. రమేష్ నాయుడు పక్షవాతంతో ఎలాంటి ఉపాధి లేకుండా ఉన్నారు. వీరి భార్య కుటుంబ పోషణ కోసం క్రాంతి నగర్ రామాలయంలో స్వీపర్ గా పని చేస్తోంది. వీరి పెద్ద కుమారుడు మారెళ్ళ రోహన్ సాయి కష్టపడి చదివి పాలిటెక్నిక్ డిప్లొమాలో 94 శాతం పర్సంటేజ్ తెచ్చుకున్నారు. 2025 ఎంసెట్ లో ఉత్తీర్ణత పొంది విజయనగరం ఎంవిజీఆర్ ఇంజనీరింగ్ కాలేజి లో బిటెక్ 2వ సంవత్సరంలో ఉచిత సీటు పొందారు. అయితే అక్కడి హాస్టల్ లో ఉండడానికి వార్షికంగా రూ.50వేలు కట్టాలి. వీరి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న క్రాంతినగర్ కు చెందిన దంపతులు.. కె. సాంబశివుడు, కె.శివకుమారిలు ప్యాపిలి మండలం నేరేడుచర్ల గ్రామం ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయుడుగా మరియు పాణ్యం మండలం మద్దూరు గ్రామం ఎంపిపిఎస్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.
బాగా చదువుతున్న ఆ విద్యార్థిని ప్రోత్సహించడానికి మరియు ఆ కుటుంబాన్ని దత్తత తీసుకోవడానికి ఇద్దరు ప్రభుత్వ టీచర్లు మార్గదర్శకులుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.50వేల చెక్కును కలెక్టర్ చేతులమీదుగా ఎం.రోహన్ సాయికి అందించారు. సదరు విద్యార్థి బిటెక్ కాలం పూర్తి అయ్యే వరకు వసతి గృహం ఫీజు చెల్లిస్తామని ఇద్దరు ప్రభుత్వ టీచర్లు కలెక్టరుకు వివరించారు. ఇందుకు వారిరువురిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో ఎలాంటి బలవంతం లేదని మార్గదర్శకులుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయులను స్ఫూర్తిగా తీసుకొని... సమాజంలో ఆర్థికంగా వృద్ధి చెందినవారు దిగువ స్థాయిలో ఉన్న బంగారు కుటుంబాల వారిని దత్తత తీసుకోవడానికి మరింత మంది ముందుకు రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.
ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు కె. సాంబశివుడు, కె.శివకుమారి, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ లకు అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు తక్షణమే ఇవ్వాలి.!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 05:**
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు సోదరులందరికీ కొత్త అక్రిడేషన్ కార్డులతో పాటు,ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వాలని ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ అన్నారు. మంగళవారం నాడు నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర ఉన్న ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఐరా లోని పాత్రికేయులందరూ జర్నలిస్ట్ ల కోర్కెల దినం సందర్భంగా మీడియా సమావేశాన్ని నిర్వహించారు.సందర్భంగా ఐరా రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన కూడా అర్హులైన పాత్రికేయులకు నేటికీ క్రొత్త అక్రిడేషన్ లు ఇవ్వలేదని,ప్రభుత్వం మూడు మాసాలకు ఒకసారి పొడిగిస్తూ వస్తుందని ఈసారి పొడిగించకుండా క్రొత్త అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని ఐరా రాష్ట్ర అధ్యక్షులు జయ ప్రకాశ్ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్లుగా జర్నలిస్ట్ ల సమస్యల కోసం పని చేస్తుందని ఆశించామని అన్నారు.అయితే ఆశించిన స్థాయిలో ఈ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు మరియు సంక్షేమం కోసం పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా క్రొత్త అక్రిడేషన్ లు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం వాయిదాల మీద వాయిదాలు వేస్తూ కాలయాపన చేస్తుందన్నారు.
గత ప్రభుత్వం వల్ల ఎంతో మంది అర్హులైన పాత్రికేయులు అక్రిడేషన్ సౌకర్యం కోల్పోయారని, ఈ కూటమి ప్రభుత్వం రాకతో అందరికీ కొత్త అక్రిడేషన్ లు వస్తాయని ఆశించారని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన,కొత్త అక్రిడేషన్ లు ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదు అన్నారు. అదేవిధంగా అర్హత ఉండి కూడా చాలా మంది జర్నలిస్టులు అక్రిడేషన్ నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధానంగా హెల్త్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే అక్రిడేషన్ కావాల్సివస్తోందని అన్నారు. కనుక కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి,ఆక్రిడేషన్ లను రెన్యువల్ చేయకుండా కొత్త అక్రిడేషన్ లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే జర్నలిస్ట్ లకు యాక్సిడెంటల్ ఇన్స్యూరెన్స్ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని, యాంటీ అటాక్ కమిటీలు వెంటనే వేయాలని వారు కోరారు.అంతే కాకుండా రాష్ట్రంలోని పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు అందని ద్రాక్షగా మారాయన్నారు.
గతంలోని ప్రభుత్వాలు ఎన్నికల ముందు జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు ఇస్తామని జీఓ లు విడుదల




చేసిన, ఎన్నికల కోడ్ రావడంతో ఇళ్ల స్థలాల అంశం మరుగున పడిందన్నారు. ఈసారి అలా కాకుండా కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు,ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరారు. అలాగే దీర్ఘకాలికంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు సమస్యలు 50 సంవత్సరాలు నిండిన ప్రతి పాత్రికేయునికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నీ కూడా జర్నలిస్టులు అందరికీ అదే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు పిల్లలందరికీ ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక జీ.ఓ ను విడుదల చేయాలన్నారు.
వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఉచిత ప్రమాద బీమా కల్పించాలన్నారు.
జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అక్రిడేషన్ కమిటీలో అన్ని యూనియన్ల ప్రాధాన్యత కల్పించాలన్నారు.
జర్నలిస్టులందరికీ ప్రభుత్వమే ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి,ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అన్ని పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చి సమానత్వాన్ని పాటించాలన్నారు.అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు 50 లక్షల విలువతో కూడిన హెల్త్ కార్డులను ఇవ్వాలన్నారు.ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిగా పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా ఆర్ఎన్ఐ కలిగిన పతి పత్రికకు అక్రిడేషన్లు ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి జాషువ బాబు,గౌరవ సలహాదారులు జయప్రకాష్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్ బాబు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ బాబు,జిల్లా అధ్యక్షులు లెజండ్ శ్రీను,జిల్లా ప్రధాన కార్యదర్శి రంగా రావు, సీనియర్ పాత్రికేయులు విజయానంద్ మరియు పవన్ లు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ, డ్రగ్స్,ర్యాగింగ్ మొదలగు వాటిపై
# అవగాహన కార్యక్రమం ఏర్పాటు.

**- సబ్ ఇన్స్పెక్టర్ జగన్ మోహన్.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 05:**నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి మంద.జావళి ఆల్ఫోన్స్ సూచనలతో బండిఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు సబ్ ఇన్స్పెక్టర్ జగన్ మోహన్ ఆధ్వర్యంలో రోడ్డుభద్రత ,ర్యాగింగ్ మరియు మాదకద్రవ్యాల వలన కలిగే పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు రోడ్డు భద్రత యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం మరియు చిన్న వయస్సు నుండే రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమాలను పాటించడం మరియు అనుసరించడం ప్రోత్సహించడం లక్ష్యంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. చిన్నతనం నుండి పిల్లలను సన్మార్గంలో నడిపించాలని ఉద్దేశంతో ఈ వయసులో పిల్లలు త్వరగా గ్రహిస్తారు కాబట్టి, ఈ విలువలను పిల్లల జీవితాల్లో ముందుగానే పెంపొందించడం వల్ల భవిష్యత్తులో బాధ్యతాయుతమైన ప్రవర్తనకు దారితీస్తుందని అభిప్రాయపడ్డారు.
సమాజంలో సురక్షితమైన రహదారి అలవాట్లను కలిగి ఉండాలని మరియు కొత్త మోటార్ వెహికల్ యాక్ట్ నియమాలు మరియు జరిమానాలు ,ట్రాఫిక్ నియమ నిబంధనలు, అతి వేగం, డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యత మరియు ర్యాగింగ్ మరియు దాని పరిణామాలు, మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలు మొదలైన వాటిపై అవగాహన కల్పించడం జరిగింది.

# ఆగస్టు 19 నుంచి పి4 అమలుకు ప్రభుత్వ నిర్ణయం.

**ఉద్యమ స్ఫూర్తితో... పి 4 అమలుకు కృషి చేయాలి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**పి4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు అవసరమైన తోడ్పాటు అందించాలి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు, 05:**
ఆగస్టు 19 నుంచి పి4 అమలుకు ప్రభుత్వ నిర్ణయించడం జరిగింది. పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన పి4 (ప్రభుత్వ- ప్రైవేటు-ప్రజల-భాగస్వామ్యం) కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మెరుగైన తోడ్పాటు ఇచ్చేందుకు ఉద్యమ స్ఫూర్తితో ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి పి4 (ప్రభుత్వ- ప్రైవేటు- ప్రజల-భాగస్వామ్యం) కార్యక్రమంపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా మాట్లాడుతూ.... రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడానికి పి4 (ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల-భాగస్వామ్యం) కార్యక్రమాన్ని వినూత్నంగా రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో మార్గదర్శులుగా నమోదైన వారు బంగారు కుటుంబాల అవసరాల మేరకు చేయూతను ఇవ్వడం ద్వారా వారు జీవితంలో ఇంకా ముందుకు రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా 250 మంది బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వడానికి తాను కూడా మార్గదర్శిగా నమోదు కావడం






జరిగిందన్నారు. ప్రస్తుత ప్రపంచంలో తలసరి ఆదాయంలో తెలుగు వారు ప్రథమంగా ఉన్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆగస్టు 19 నుంచి పి4 అమలుకు నిర్ణయించడం జరిగిందని ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను, విధివిధానాలపై ఒక బుక్లెట్ రూపొందించడం జరిగిందన్నారు. ఆగస్టు 15వ తేది నాటికి పి4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా అనుసంధానం చేయడం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జిల్లాలో ఆగస్టు 19 నుంచి పి4 అమలును ఒక ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం బంగారు కుటుంబాలుగా నమోదైన వారికి చేయూతను ఇవ్వడం కోసం ఆగస్టు 15లోగా మార్గదర్శకుల నమోదు పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా వాలంటీర్ గానే జరగాలన్నారు. ఎవరిని బలవంతం చేయవద్దని... సహాయం చేయాలనే మనసున్న సమయం లేని వారు ఉంటారని, మనసున్న వారు, మానవత్వం కలిగిన అలాంటి వారిని గుర్తించి పి4 వేదిక ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలను జారీ చేశారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లాఅధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలి.

**మాజీ ఎమ్మెల్యే శిల్పారవి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 05:**
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నడూ నిజాలను మాట్లాడలేదని, ఇప్పటికైనా ప్రజలతో నిజాలు మాట్లాడాలని, ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3,5, వార్డుల పరిదిలో నడిగడ్డ లోని కన్యకా పరమేశ్వరి స్కూల్ నందు వైఎస్ఆర్సిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్ని సా, రాష్ట్ర మహిళా జనరల్ సెక్రెటరీ శశికలా రెడ్డి, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్స్ షాదిక్ భాష, సమ్మద్,ఆరిఫ్ నాయక్, మాజీ కౌన్సిలర్ మునయ్య, కన్నమ్మ, గౌస్, చాంద్ బి, మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ... ఎన్నికల ముందు ప్రజలకు సాధ్యం కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చాడని, నీతులు వల్లించే చంద్రబాబు ఇప్పటికైనా నిజాలు మాట్లాడాలని, సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని కోరారు. ఖరీఫ్ సీజన్లో రైతులు పంటల సాగుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో యూరియా నిల్వలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారని అయితే ఇందులో నిజం ఎంతో తెలియాల్సి ఉందన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో రైతు



భరోసా కేంద్రాల ద్వార రైతన్నలకు యూరియాను ప్రతి ఏటా అందిచారని, నేడు యూరియ పంపిణీలో సంబంధిత అధికారుల ప్రమేయం లేకుండా టీడీపీ నేతలే యూరియా పంపిణీదారులా అవతారం ఎత్తారని రైతన్నలను నట్టేట ముంచుతూ తమ అనుయాయులకే యూరియాను అందిస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్ కు సాక్షాధారాలతో చూపించామని తెలిపారు. తలికి వందనం పథకం అమలులో ఎంత మంది తల్లుల ఖాతాల్లో చెప్పిన నగదు బదిలీ అయ్యిందో అధికారులు తెలియజేయాలని, గతంలో అమ్మ ఒడి పథకంలో అర్హులైన ప్రతి విద్యార్థి తలి ఖాతాలో నగదు ఎటువంటి కోతలేకుండా నేరుగా జమ జేశామని తెలిపారు. ఇప్పుడు తల్లికివందనం పథకంలో అబ్ధిదారుల సంఖ్య గతంలో కంటే ఎక్కువ ఉండాలని అయితే అందుకు భిన్నంగా తక్కువ సంఖ్యంలో అందిస్తూ భీరాలు పలుకుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన



నాటి నుండి చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, మోసాలను, అవినీతిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క వైసీపీ నాయకునికి, కార్యకర్తకు ఉందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం గురించి వివరించాలని, చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన తమ పోరాటాలను కొనసాగిస్తామని, ఇచ్చిన ప్రతి హామీలు నెరవేర్చేవరకు ఉద్యమాలు ఆగవన్నారు.

## ఎకరాకు 800 చెల్లించి
# ఇన్సూరెన్స్ చేయించుకోండి.




**ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 05:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రైతులు వరి పంటకు సంబంధించి ఎకరాకు 800 రూపాయలు ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మహానంది మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి బొల్లవరం, తమ్మడపల్లె లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు నష్టపోకుండా ఉండేందుకు గాను పంటల ఇన్సూరెన్స్ చేయించుకుంటే రైతులు నష్టపోయిన ఆర్థిక సహాయ సహకారాలు ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్ళ నుండి అందే అవకాశం ఉందని సూచించారు. అన్నదాత సుఖీభవ కు అర్హులైన జాబితా సంబంధిత గ్రామపంచాయతీ వ్యవసాయ శాఖ అధికారుల వద్ద ఉందని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి డబ్బులు పడని వారు మరల దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని దానిని సమీపంలోని పంచాయతీ కార్యాలయంలో ఉన్నటువంటి వ్యవసాయ శాఖ అధికారి వద్ద గ్రీవెన్సల్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. 10 సెంట్లు కంటే వ్యవసాయ భూమి తక్కువ ఉన్న అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని, పన్ను చెల్లించేవారు, ఉద్యోగస్తులకు ఈ పథకం వర్తించదన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మరియు ఓసి ఇతర కౌలు రైతులకు ఈ పథకం వర్తిస్తుందని అర్హులైన వారందరూ కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూరియా, డి ఏ పి కొరత లేదని దీని రైతులు గమనించి ముందస్తు నిలువలు చేసుకోవద్దని సూచించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి సంబంధించి డబ్బులు పడని రైతులు ఒకసారి తమ బ్యాంక్ ఖాతాలను తనిఖీ చేయించుకొని ఆధార్ కార్డు మరియు సెల్ నెంబర్ లింక్ అయినవి లేనివి తెలుసుకొని సవరించుకోవాలన్నారు. రైతులు తాము వేసిన పంటలను రైతు సేవ కేంద్రాల వద్దకు వెళ్లి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మొక్కజొన్న పంటలను పరిశీలించారు. తర్వాత రైతులకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు . రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి జీవన సేంద్రియ ఎరువులు వాడకంతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల నష్టాలనుండి లాభాల వైపు రైతులు పయనించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేశ్వర్ రెడ్డి తో పాటు వ్యవసాయ శాఖ ఏ ఈ ఓ శ్రీనివాసరెడ్డి బొలవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరత్న వీఆర్వో మాధవరావు, బొల్లవరం వ్యవసాయ శాఖ అధికారిని మంజుల ఇతర రైతులు పాల్గొన్నారు.

# ఉత్పాదన, సేవా రంగాల్లోని 35 యూనిట్లకు రూ.121.44 లక్షల విలువైన రాయితీ మంజూరు.

**సింగిల్ డెస్క్ పోర్టల్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి.**

**ర్యాంప్ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రోత్సహించండి.**

**ప్రభుత్వ ఆదేశాల మేరకు యువతకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించండి.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు, 05:** ఉత్పాదన, సేవా రంగాల్లోని 35 యూనిట్లకు మొత్తంగా రూ. 121.44 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతుల ప్రమోషన్ కమిటీ మరియు జిల్లా నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్ తదితరాలలో రాయితీ ప్రయోజనాలు కల్పిస్తోందన్నారు. గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోసం 139 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 131 పరిశ్రమలకు అనుమతులు మంజూరు అయ్యాయని, ఇంకను 8 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ క్రింద చేపడుతున్న సర్వేను కూడా త్వరగా పూర్తి చేసేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ర్యాంప్ కార్యక్రమం ద్వారా సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల పెంపుదలకు రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ద్వారా పరిశ్రమల స్థాపనకు యువ పారిశ్రామికవేత్తలు, మండలాల్లోని యువత ముందుకు వచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు.
నైపుణ్య అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల మేరకు జిల్లాలో స్కిల్ హబ్స్, ఈఎస్ఈలలో జాబ్ మేళాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎంత మంది యువత నైపుణ్య శిక్షణను పొందుతున్నారన్న అంశాన్ని నైపుణ్యం వెబ్సైట్ లో కలెక్టర్ పరిశీలించి, ప్రగతి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా 2025లో నిర్వహించే జాబ్ మేళా బ్రోచర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఎస్.మహబూబ్ బాషా, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అధికారి శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఐటిడిఎ పిఓ వెంకట శివప్రసాద్, ఎల్డీఎం రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజమహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల పెంపు ఆపాలని.. స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని సిపిఐ ఆధ్వర్యం లోధర్నా..!




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 05:** సిపిఐ వామపక్ష ప్రజాసంఘాల రాష్ట్ర సమితి పిలుపుమేరకు మంగళవారం నాడు విద్యుత్ డి ఈ కార్యాలయం ఎదుట సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అధ్యక్షతన ధర్నా నిర్వహించి అనంతరం విద్యుత్ అధికారి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది. ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటా రాముడు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు భూమని శ్రీనివాసులు. లక్ష్మీదేవి. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు. మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ. హాజరు కావడం జరిగింది. అనంతరం జరిగిన ధర్నాను ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ .సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ .విద్యుత్ చార్జీల పెంపుతో పేద మధ్యతరగతి వ్యాపారవేత్తలు ఆర్థికంగా స్థితికి పోతున్నారు. 2019. 20 నుంచి 2023. 24 సంవత్సరాల కు సంబంధించి విద్యుత్ రిటైర్ వ్యాపార లోటు పేరుతో రూ. 1271 కోట్ల ట్రూ ఆఫ్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్తు నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయి 2014. 19 కాలానికి సంబంధించిన 3 వేల కోట్ల ట్రూ ఆఫ్ చార్జీలు వసూలు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక 2022. 23. 2023. 24. సంవత్సరాల కాలానికి రూ. 15485 కోట్లు సర్దుబాటు చార్జీల భారం మోపారు 2024. 25. సంవత్సరానికి ప్రతి నెల యూనిట్కు 40 పైసలు చొప్పున ఒక్క సంవత్సరంలోనే రూ. 2.787 కోట్లు వసూలు చేశారు అని అన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని అన్నారు లేనియెడల మరో బషీర్బాగ్ ఉద్యమం రిపీట్ కాగలరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటేశ్వర్లు. బాలుడు మా భాష ఎం హబీబ్ బేగ్ సుబ్బరాయుడు. రవికుమార్ నాగార్జున మద్దిలేటి రమాదేవి. రమ్మీ జాబి పద్మావతి సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంఎల్ఎ శిల్పా రైతులకు క్షమాపణ చెప్పాలి

## మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు.

**కోర్టు ఉత్తర్వులతో మార్కెటు కమిటీకి మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్సు అదికారాలు.**

**త్వరలో శిల్పా సహకార్ తోసహా షాపింగ్ కాంప్లెక్సుస్వాదీనానికి మార్కెట్ యార్డు కమిటీ ఏర్పాట్లు.**

**మంత్రి ఆదేశాలతో తదుపరిచర్యలకు సిద్దమయిన మార్కెట్ యార్డు కమిటీ.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 05:** వైసీపి ప్రభుత్వంలో శిల్పా కుటుంబం అధికారాన్ని అడ్డుపెట్టుకుని 15 ఏళ్లపాటు సేవపేరుతో రైతుల సొమ్మును అప్పనంగా స్వాహాచేసిన శిల్పా కుటుంబం నంద్యాల రైతులకు క్షమాపణ చెప్పాలని మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు డిమాండ్ చేశారు.మంగళవారం మార్కెట్ యార్డు కార్యాలయంలో సొసైటీ అద్యక్షులు, మార్కెట్ యార్డు కమిటీ మెంబర్లతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.ఈసందర్బంగా హరిబాబు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా సేవపేరుతో అదికారాన్ని అడ్డుపెట్టుకునిశిల్పా కుటుంబం యార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్సులో రూములను కారు చౌకగా పొందారన్నారు.ఒక్కొక్క రూముకు 920 రూపాయలనుండి 2700 రూపాయల వరకు నేటి వరకు చెల్లించారని వాస్తవంగా పక్కనే మరో వ్యక్తికి ఇచ్చిన షాపు ఈ రూం అద్దెకు నాలుగు రెట్లు ఉందన్నారు.గత15 ఏళ్లుగా దాదాపు రూ.5కోట్ల రూపాయల మేర రైతులకు చేరవలసిన మార్కెటు యార్డు సొమ్మును శిల్పా కుటుంబం అనుభవించిందన్నారు..శిల్పా లీజు గడువు ముగియడంతో నోటీసులు అందించామని అయితే వారు హైకోర్టును ఆశ్రయించి తమకే రూంలు ఇవ్వాలని కోరారన్నారు..అయితే గౌరవ న్యాయస్థానం ఈవిషయంపై విఃచారణ జరిపి రూంలు అద్దెకు ఇచ్చే ప్రక్రియలో మార్కెట్ యార్డు కమిటీకే సర్వాదికారాలు కట్టబెడుతూ తీర్పు ఇచ్చిందన్నారు..గౌరవన్యాయస్థానం తీర్పు మేరకు త్వరలో మంత్రి ఎన్ ఎండి పరూఖ్ ఆద్వర్యంలో మార్కెట్ యార్డు కమిటీ నిర్ణయం తీసుకుని కారుచౌకగా శిల్పా కుటుంబం తీసుకున్న రూం లను స్వాదీనంచేసుకుంటామన్నారు.. సేవపేరుతో రైతుల సొమ్ముకు గండికొట్టేబదులు మాజీ ఎం.ఎల్.ఎ కి రైతునగరం ప్రాంతంలో పొలాలు ఉన్నాయని వాటిలో షాపింగ్ నిర్వహించి లేదా మరో ప్రాంతంలో అద్దెకు తీసుకుని సేవ చేయాలని ఈసందర్బంగా మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాజీ ఎం.ఎల్.ఎ ,శిల్పాకు సూచించారు.

# మంత్రి ఫరూఖ్ చొరవతో నంద్యాల జిల్లాలో యూరియా కొరత లేదు.

**మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు. -మాజీ ఎంఎల్ఎ శిల్పారవి ఆరోపణల్లో వాస్తవంలేదు.**

**యూరియా సరపరాపై అదికారులతో మంత్రి నిరంతరం సమీక్ష. -రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 05:** నంద్యాలజిల్లాలో మంత్రి ఎన్ ఎండి పరూఖ్ చొరవతో యూరియా కొరతలేదని నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టెక్కె మార్కెట్ యార్డు కార్యాలయంలో గోస్పాడు మండలం సొసైటీ అద్యక్షులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈయేడాది ఖరీఫ్ ప్రారంభంలోనే సకాలంలో వర్షాలు కురియడం,సాగునీటిని సకాలంలో విడుదల చేయడంతో రైతులు ఆనందంగా మే,జూన్ నెలలో వ్యవసాయపనులు ఆరంభించారని,నందికొట్కూరు,ఆత్మకూరు,ఆళ్లగడ్డ ప్రాంతాలలో మొక్కజొన్న,సోయాబీన్, మినుము సాగు విస్థీర్ణంపెరిగిందన్నారు. గత యేడాదికంటే 55వేల హెక్టార్లలో సాగు విస్థీర్ణం పెరిగిందని,వరి పంట కూడా గతంకంటే ఎక్కువ సాగు చేసే అవకాశాలున్నాయని అదికారులు అంచనాలు వేశారన్నారు.జిల్లా రైతులకు ఖరీఫ్ సీజనులో 44,778 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించారని, జూలైవరకు 18 వేల 293 మెట్రిక్ టన్నులు అవసరంకాగా నేటికి 17,561 మెట్రిక్ టన్నుల యూరియా అదికారులు రైతులకు అందించారన్నారు..జిల్లాలోని రైతులకు సకాలంలో ఆర్ బికె, పిఎసియస్, డిసిఎం ఎస్ ప్రయివేటు డీలర్ల ద్వారా యూరియా అందిస్తున్నామన్నారు. రైతులు వాడవలసిన మోతాదుకంటే పంటకు ఎక్కువగా యూరియా వాడటం,యూరియాదొరకదేమోనని ఆందోళనతో ఎక్కువ యూరియా కొనుగోలుచేసి నిల్వలు ఉంచడం వల్ల ఈయేడాది యూరియా అవసరం పెరిగిందన్నారు. ఈవిషయం దృష్టిలో పెట్టుకుని న్యాయశాఖామంత్రి పరూఖ్ వ్యవసాయశాఖామంత్రితో మాట్లాడి జిల్లాకు యూరియా కేటాయింపులు పెంచేందుకు కృషిచేశారన్నారు..వాస్తవాలు ఇలా ఉంటే మాజీ ఎంఎల్ఎ శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి అసత్య ఆరోపణలుచేస్తూ రైతులను తప్పుదోవపట్టిస్తున్నారని గుంటుపల్లి ఆరోపించారు.గతంలో సండే ఎం.ఎల్.ఎ,గాపేరుపొందిన మాజీ ఎం.ఎల్.ఎ. శిల్పా మూడునెలలకు,ఆరునెలలకు ఒకసారి నంద్యాలకు వచ్చినాలుగురాళ్లు వేసి రైతులను రెచ్చగొట్టి, ప్రతిగ్రామ లీడర్లపై ఆరోపణలుచేస్తూ దుష్ప్రచారంచేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై, టిడిపి నేతలపై మాజీ ఎంఎల్ ఎ బురద చల్లడం తగదని ఆయన హితవు పలికారు.సమావేశంలో గోస్పాడు మండలంలోని సొసైటీ అద్యక్షులు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# గ్రామ ప్రథమ పౌరుడు అదృశ్యం...కేసు నమోదు.

## ఎస్సై జగన్మోహన్.



**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు ఆగస్టు 05:** మండల పరిధిలోని పెద్దదేవపురం గ్రామ సర్పంచ్ పెద్దినేని .పెద్దన్న (38) అదృశ్యమైనట్లు బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్ తెలిపారు.ఎస్సై కథనం ప్రకారం పి.పెద్దన్న పెద్దదేలాపురం గ్రామానికి సర్పంచ్ గా సేవలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలపుడు ఇంటి నుండి బయటకు వెళ్లి మంగళవారం సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల బంధువులను కూడా విచారించగా ఎటువంటి ఆచూకి లభించనందున మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులు సదరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.అనంతరం ఎస్సై కేసు నమోదు చేయడం జరిగింది.

# మహిళా సాధికారతపై విస్తృత సమీక్షా.

## -నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 05:** జనస్వామ్య సహకారం, మహిళల నాయకత్వం వంటి పలు అంశాలపై మంగళవారం ఢిల్లీలోని బ్రిటిష్ హై కమిషనర్ క్రిస్టినా స్కాట్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం జరిగినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. యూకే హౌస్ ఆఫ్ కామన్స్ డిప్యూటీ స్పీకర్ నుస్రత్ ఘనీని ఆహ్వానించామని,జనస్వామ్య సహకారం, మహిళల నాయకత్వం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించుకున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

# చాబోలు లో పొలం పిలుస్తోంది కార్యక్రమం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ ఆగస్టు 05:** చాబోలు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా వనరుల కేంద్రం, నంద్యాల వారు రైతు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య గారు మాట్లాడుతూ వరి పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించడం జరిగింది. అలాగే ప్రస్తుతం వరి నారు మడులలో జంకు లోప నివారణకు 2 గ్రాముల జంకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చెయ్యాలని అలాగే 5 సెంట్ల నారుమడి కి 2 కేజీల నత్రజని ఒక కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను వెయ్యాలని తెలిపారు.కాండం తొలుచు పురుగు నివారణకు ఒక సెంటు నారుమడి కి 160 గ్రాముల కార్బోఫురాన్ 3 జి గుళికలు వేసుకోవాలని సూచించారు. వరి ప్రధాన పంటలో ఎరువులను మోతాదుకు మించి వాడరాదని, ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 32 కిలోల పొటాష్ లను ఇచ్చే ఎరువులను వేసుకోవాలని తెలిపారు. అలాగే నానో యూరియా మరియు నానో డి.ఏ.పి ఎరువుల వాడుక వలన పర్యావరణ మరియు భూమి కాలుష్యం తగ్గించి నాణ్యమైన దిగుబడులు పొందగలరని తెలియజేశారు.మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు సాగు చేయాలని ఇందుకు గాను ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరించి పంటలు సాగు చేయాలని, దీని వలన నాణ్యమైన దిగుబడులు పొందటమే కాకుండా, అధిక మార్కెట్ ధర పొందగలరని తెలిపారు.అలాగే కౌలు రైతులందరూ తప్పకుండా పంట సాగుదారు హక్కు పత్రాలు కలిగి ఉండాలని ఇందుకుగాను సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి ఈ పత్రాలు పొందగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారులు మనోహర్, శ్రీధర్ , బాలలింగామయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది హర్షిత మరియు రైతులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన గాలి కోసం ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలి.

## సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.


పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

**ఆంధ్ర ప్రగతి డోన్ ఆగస్టు 05:** ఆరోగ్యకరమైన గాలి కొరకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని అలాగే స్వచ్ఛమైన గాలి పై ప్రతి ఒక్కరికి అవగాహణ కల్గి ఉండాలని
సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు. వాయు కాలుష్యం అనేది ప్రపంచ ప్రజారోగ్యానికి అతిపెద్ద పర్యావరణ ప్రమాదం. జనాభాలో అధిక శాతం మంది కలుషితమైన గాలికి గురవుతున్నారని అంచనా వేయబడింది. దీనివల్ల ప్రతి సంవత్సరం చాలా మంది అకాల మరణాలు సంభవిస్తున్నాయి. కలుషితమైన గాలి ముఖ్యంగా పిల్లలు మరియు వృద్ధులపై ప్రభావం చూపుతుంది. మానవ ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి వాయు కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు గాలి నాణ్యతను మెరుగుపరచడానికి ప్రభుత్వాలు నిరంతరం కృషి చెయ్యాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు. ప్రస్తుతం మానవుడు జీవన పరిస్థితులను, పర్యావరణ ప్రక్రియలను ఉల్లంఘిస్తుండటం వల్ల మన జీవన శైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుంది. అనేక రోగాలకు దారితీస్తున్నాయి. కావున ప్రకృతిలో అన్ని సమతుల్యతలను మనిషి పాటించాలి. లేకపోతే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రకృతిని మనం సంరక్షితే అది మనల్ని కాపాడుతుందని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి.

## సింహ గర్జన మహాసభలో నేతల డిమాండ్.






**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల ఆగస్ట్ 05:** సమాజంలోని ప్రతి రజక కుటుంబాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సింహ గర్జన జాతీయ అధ్యక్షులు మొగ్గ అనిల్ కుమార్ పేర్కొన్నారు. గోస్పాడు మండల పరిధిలోని యాలూరు గ్రామ పంచాయితీ పరిధిలో గల శివాలయ ప్రాంగణంలో మంగళవారం రజకుల సింహగర్జన మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్ కుమార్ మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని లేని పక్షంలో ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు ఉద్యమ పోరాటాలు చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్న రజకులను అన్ని రంగాల్లో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా రజక సింహ గర్జన మహాసభలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. రాయలసీమ ఇన్చార్జిగా నాగేంద్ర, ఆంధ్రప్రదేశ్ రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ సెక్రెటరీ ప్రశాంత్, సంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, ఏపీ మహిళా అధ్యక్షురాలు రమాదేవి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుండి రజకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానసికస్థితి బాగోలేదు

## -జగన్ వ్యాఖ్యలకు మంత్రి రామానాయుడు కౌంటర్



**గుడివాడ, ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి ::** జగన్మోహనరెడ్డి మానసిక స్థితి బాగోలేదంటూ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావులతో కలిసి మంత్రి రామానాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మామిడికాయలకు, తలకాయలకు తేడా తెలియని వ్యక్తి జగన్ అని అన్నారు. కన్ను పీకేస్తాం, కాలు తీసేస్తాం, రప్పా రప్పా అంటూ సరికేస్తామంటే కుదురుతుందా అని ప్రశ్నించారు. జగన్ ముఠా లూటీల సొమ్ము దొరకడంతో ఆందోళన మొదలైందన్నారు. విధ్వంసం సృష్టించేందుకే పరామర్శల ముసుగులో జగన్ పర్యటిస్తున్నారన్నారు. పోలవరం నిర్మాణం చివరి దశకు చేరుకుందని, హామీలన్నీ అమలు చేస్తున్నామని, విశాఖ జోన్ సాధించామని, విశాఖ స్టీల్ ను కాపాడుకున్నామని, అమరావతి పరుగులు పెడుతోందని, ఏపీలో సంక్షేమం, అభివృద్ధి దూసుకుపోతోందని, కూటమి ప్రభుత్వానికి జగన్ సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి రామానాయుడు అన్నారు.

# మైనారిటీ శాఖ ఆస్తుల జాబితా సిద్ధం కోసం కార్యాచరణ.

## ఆస్తుల రక్షణ, అభివృద్ధికి చర్యలు. హజ్ యాత్రికుల కోటా పూర్తి అయ్యేలా చూడాలి.

## మైనారిటీ శాఖాధికారులకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశం.





**ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 05:** రాష్ట్రంలో మైనారిటీ సంక్షేమ శాఖ కు అనుబంధంగా ఉన్న వివిధ ఆస్తుల జాబితాను సిద్ధం చేసేందుకు కార్యాచరణ ప్రారంభించాలని ఆ శాఖాధికారులకు రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు. మంగళవారం వెలగపూడి సచివాలయం 3వ బ్లాక్ లోని మైనారిటీ సంక్షేమ శాఖ పేషి లో మంత్రి ఫరూక్ వివిధ అంశాలపై సమీక్ష చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, వక్ఫ్ సర్వే కమిషనర్ శిరీన్ బేగం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి యాకుబ్ బాషా, వక్ఫ్ బోర్డు సీఈఓ మొహమ్మద్ అలీ, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి ఏ.శేఖర్ తదితరులతో శాఖపరమైన వివిధ అంశాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. మైనారిటీ శాఖలోని అన్ని ఆస్తుల జాబితాను సిద్ధం చేయాలని,ఆస్తుల రక్షణ, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ అధికారులను ఆదేశించారు. హజ్ -2026 కోసం యాత్రికుల నుండి దరఖాస్తు గడువు చివరి తేదీ 7 నాటికీ రాష్ట్రానికి కేటాయించిన కోటా 2556 కంటే తక్కువ కాకుండా దరఖాస్తులు అందేలా చూడాలని హజ్ కమిటీ ఈవో ను ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి హాజ్ యాత్రకు సంబంధించి ఇప్పటివరకు 2222 దరఖాస్తులు వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులను రక్షించడానికి, అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలను సకాలంలో తీసుకోవాలని వక్ఫ్ బోర్డు సిఈవో కు మంత్రి ఫరూక్ సూచించారు. రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని మైనారిటీ అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆయా శాఖల ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# వైభవంగా నంద్యాల డయాసీస్ బిషప్ గా

# సంతోష్ ప్రసన్న రావ్ ప్రమాణ స్వీకారం.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల :** సి ఎస్ ఐ చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా నంద్యాల డయాసీస్ బిషప్ గా కామనూరి సంతోష్ ప్రసన్న రావ్ ను ప్రమాణ స్వీకారం మంగళవారం నాడు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నంద్యాల పట్టణంలో ఉన్న హెలీ క్రాస్ సెంటినరి చర్చ్ లో నూతన బిషప్ గా కామనూరి సంతోష్ ప్రసన్న రావ్ ను అభిషేకించి బిషప్ బాధ్యతలను అప్పగించిన చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మాడరేటర్ రూబెన్ మార్క్.నంద్యాల అధ్యక్ష మండల ( నంద్యాల డయాసిస్ బిషప్ ) పీఠాధిపతిగా ఎన్నికైన రెవరెండ్ సంతోషి ప్రసన్న రావు ప్రమాణ స్వీకార ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సౌంత్ ఇండియా పరిధిలోని బిషప్ లు , ఆఫీస్ బేరర్ లు ఇతర ముఖ్య అతిథులు పాల్గొన్నారు.
భారీ ఊరేగింపుతో నూతన బిషప్ దంపతులకు స్వాగతం పలికారు. గత 2024 సంవత్సరం ఏప్రిల్ నెలలో నంద్యాల అధ్యక్ష మండలపు పీఠాధిపతి ఎంపికకు జరిగిన ఎన్నికల్లో అర్హత సాధించిన రెవరెండ్ సంతోష్ ప్రసన్న రావును చెన్నైలోని సినాడ్ అధికారులు ఎంపిక చేయడం జరిగింది.
ఈ సందర్భంగా ఈ రోజు మాడరేటర్ రూబెన్ మార్క్ చేతుల మీదుగా పీఠాధిపతి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఊరేగింపు, బహిరంగ సభ నిర్వహించి అభినందనలు తెలియజేశారు.
ఈ కార్యక్రమానికి సీనాడ్ మోడరేటర్ రూబెన్ మార్క్ తండ్రి , జనరల్ సెక్రెటరీ ఫెర్నాండేజ్ హాజరయ్యారు. అలాగే నంద్యాల డయాసిస్ పరిధిలోని నంద్యాల, కర్నూలు, అనంతపురం , కడప , ప్రకాశం జిల్లాల్లో పనిచేతున్న చర్చ్ ఫాదర్ లు , క్రైస్తవులు హాజరయ్యారు.కార్యక్రమంలో పాల్గొన్న రాయలసీమ బిషప్ ఐజక్ వరప్రసాద్ , కృష్ణ గోదావరి బిషప్ జార్జ్ కొర్నేలియాస్ , డోర్నకల్ బిషప్ పద్మారావు , కోయంబత్తూర్ డిసెప్ట్ తిమోతి రవీందర్ , కర్ణాటక సెంట్రల్ బిషప్ హేమచంద్ర కుమార్ , మధురై బిషప్ జయ సింగ్ ప్రిన్స్ ప్రభాకరన్ తదితరులు హాజరయ్యారు.

# బిసి సంక్షేమ బాలికల వసతి గృహ టాయిలెట్లను ప్రారంభించిన జిల్లా కలెక్టర్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 05:** నంద్యాల పట్టణం ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో సిఎస్ఆర్ నిధులు రూ.13 లక్షల ఖర్చుతో నూతనంగా నిర్మించిన ఆరు టాయిలెట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రారంభించారు.పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో దాదాపు 250మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. సదరు వసతి గృహంలో బాలికా విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు లేనందున ఇబ్బంది పడుతున్న విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఇందుకు సంబంధించి సిఎస్ఆర్ లో భాగంగా వసతి గృహంలో అదనంగా టాయిలెట్ వసతి కలిగిన బాత్రూంలు నిర్మించాలని రాయలసీమ ఎక్స్ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ వారికి కలెక్టరు సూచించారు. ఈ మేరకు నూతనంగా నిర్మించిన 6 టాయిలెట్ బ్లాక్ లను కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన టాయిలెట్లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... వసతి గృహాలలోని విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. వసతి గృహంలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అందరూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలి. ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహంలో సరిపడ టాయిలెట్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం దృష్టికి వచ్చిన పిదప రాయలసీమ ఎక్స్ప్రెస్ వే వారిని సి ఎస్ ఆర్ లో భాగంగా టాయిలెట్లు నిర్మించాలని కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు వారు బాధ్యతగా త్వరితగతిన టాయిలెట్లను నిర్మించి ప్రారంభింప చేయడం సంతోషించదగిన విషయమని.. ఇందుకు వారిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, రాయలసీమ ఎక్స్ప్రెస్ ప్రాజెక్ట్ హెడ్ మదన్మోహన్ వంగర, వారి సిబ్బంది, వసతి గృహం విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



# అసంఘటిత కార్మికుల రక్షణకు చర్యలు


## పట్టణాల్లో ఇంటిగ్రేటెడ్ కార్మిక భవనాల నిర్మాణం


## కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**విజయవాడ,ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. భవన నిర్మాణ, ఇతర రంగాల కార్మికుల, వారి కుటుంబాల సంక్షేమమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కార్మిక, కర్మాగార, బాయిలర్స్ మరియు వైద్య బీమా సేవల శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ ఇతర కార్మికుల సంక్షేమశాఖ కార్యాలయంలో కార్మిక సంక్షేమ బోర్డు సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి హజరైన మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల రక్షణకు కార్మిక శాఖ అనేక చర్యలు తీసకుంటుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికులు ఊచకోతకు గురయ్యారని, కూటిమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా రంగాల కార్మికుల సంక్షేమంకు పెద్దపీట వేశామన్నారు. అందులో భాగంగానే ప్రతి పట్టణంలో అడ్డాకూలీగా రోడ్లపై గంటల తరబడి నిరీక్షించే పరిస్థితి రాకుండ వారి కోసం పక్కా భవనాలను నిర్మించాలని ప్రతిపాదనను బోర్డు సమావేశంలో తీసుకున్నామన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో ఇంటిగ్రేటేడ్ కార్మిక భవనాలను నిర్మించనున్నామని, క్రమంగా ప్రతి నియోజకవర్గంలో ఒక భవనం నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేశానమన్నారు. అంతేకాకుండ కార్మకులు, వారి కుటుంబ సభ్యులు నైపుణ్యం పెంచే విధంగా వారికి నైపుణ్య శిక్షణ అందించనున్నామన్నారు. అలాగే ప్రతి ప్యాక్టరీలో ఒక సేఫ్టీ అధికారిని ఏర్పాటు- చేయాలన్న ఆలోచన చేస్తున్నామని, దీంతో ప్రమాదాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడతాయన్నారు. ఇందుకోసం యూనివర్సిటీ-లతో ఎంఓయు చేసుకున్నామని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టగానే పెట్టు-బడిదారుల్లో నమ్మకం పెరిగిందని, పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు తరలి వస్తున్నారని, దీంతో మన రాష్ట్రంలో కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఏడాదికి 50 రోజుల కంటే ఎక్కువ పనిచేసేవారిని కార్మికులుగా గుర్తిస్తున్నామని, నరేగా కార్మికులను గుర్తించడంతో రాష్ట్రంలో దాదాపు 15 లక్షల మంది కార్మికుల సంఖ్య పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో సెస్స్ వసూళ్ల శాతం పెంచటం దృష్టి సారించనున్నామని, వారి రక్షణ కోసం సెస్స్ వసూళ్లపై దృష్టిసారించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులను కూడా పరిగణలోకి తీసుకురానున్నామని తెలిపారు. ఆంధప్రదేశ్ భవన నిర్మాణ ఇతర కార్మికుల సంక్షేమ మండలి ఛైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా నిలిచిపోయిన కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను పున:రుద్ధరిస్తున్నామన్నారు. కార్మికులు సంక్షేమ ఫలాలు సంపూర్ణంగా అందుకునేలా రిజిస్ట్రేషన్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆదేశాల మేరకు సెస్స్ కలెక్షన్లు పెరగడానికి కృషి చేస్తున్నామన్నారు. 2014-19 మధ్యలో కార్మికుల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, అటు-పై అధికారం చేపట్టిన ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్న సంక్షేమ కార్యక్రమాలను అధ్యాయనం చేసి ఉత్తమమైన వాటిని మన రాష్ట్రంలో అమలు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ శేషగిరి బాబు, అడిషినల్ సెక్రటరీ గంధం చంద్రుడు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నడనాట అత్యాచార కాండ !

**ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** ధర్మస్థలి....ప్రజ్వల్ రేవణ్ణ ఈ రెండు పేర్లు దేశానికి ఇప్పుడు బాగా తెలిసి పోయాయి. ముఖ్యంగా కర్నాటక ప్రజల నోళ్లల్లో నిత్యం నానుతున్న పేర్లుగా చెప్పుకోవాలి. రెండూ ఒకే తరహా కేసులుగా చూడొచ్చు. ధ్మస్థలిలో అమ్మాయిలపై అత్యాచారం చేసి చంపేస్తున్నారని, అదృశ్యం అయిన కేసుల్లో ఇప్పటికీ ఆచూకీ దక్కలేదని గుర్తించారు. అనేకమంది అమ్మాయిల మరణాలు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. ఒకరిద్దరు మాత్రమే ఫిర్యాదు చేశారు. వాటిపై చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో నాటి బిజెపి ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా సీరియస్‌గా లేవు. అందుకే ప్రజల్లో ఉన్న సీరియస్ నెస్ ఇక్కడ కానరావడం లేదు. అందుకే దర్యాప్తు నత్తనడకన సాగిస్తున్నారు. సిట్‌ను వేసినా పెద్దగా ఉపయోగం లేదన్న చర్చ కూడా మొదలయ్యింది. ధర్మస్థలి వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉన్నాయని, మాఫియా ఉందని అంటున్నారు. బాగా పలుకుబడి ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉండడంతోనే అసలు నిజాలు బయటకు రావడం లేదని తెలుస్తోంది. అయితే ఈ కుంభస్థలం ఎప్పుడో బద్దలు కాక తప్పదు. మాజీ సానిటేషన్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుతో కొంత కదలిక వచ్చినా, పాలకుల్లో ఏ మాత్రం చిత్తశుద్ధి లోపించినా దర్యాప్తు ముందుకు సాగదు. ఇకపోతే ప్రజ్వల్ రేవణ్ణ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఓ మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడిగా, ఎంపిగా సాగించినా అత్యాచారకాండ అంతాఇంతా కాదు. దీనిపై చర్చించడం కూడా అవసరం. ఇలాంటి దగుల్బాజీల పాపం పండి జైలు శిక్ష పడింది. లేకపోతే మరింతగా విర్రవీగేవారు. ఎన్‌డిఎ కూటమి పార్టీ జెడిఎస్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక దాడి కేసులు నమోదైనప్పుడు కనీసమాత్రంగా కూడా నేతలు స్పందించలేదు. ప్రజల్వల్ తీర్పును స్వాగతించలేదు. న్యాయస్థానం శిక్ష విధించాక కూడా మోడీ నుంచి కాని, బిజెపి నుంచికాని ఎలాంటి స్పందన లేదంటే మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారికి మద్దతిచ్చినట్లుగా భావించాలి. ప్రజ్వల్‌పై ఒక కేసులోనే శిక్ష పడింది. మరిన్ని కేసులు విచారణలో ఉన్నాయి. వాటిలోనూ బాధితులకు న్యాయం జరిగేలా, నిందితునికి శిక్ష పడేలా అన్ని వ్యవస్థలూ పని చేయాలి. రాజకీయ పలుకుబడి, డబ్బు ఉన్న ప్రజ్వల్ పైకోర్టులను ఆశ్రయించే అవకాశం లేకపోలేదు. తప్పించుకోకుండా పోలీసులు, బాధితులు అప్రమత్తంగా ఉండాలి. ఇకపోతే కేసు వివరాల్లోకి వెళితే..ప్రజ్వల్ రేవణ్ణ నిజంగానే ఓ దుర్మార్గుడు. ఎందరో మహిళల మానాలను దోచుకున్న దుండగుడు. అతనికి జీవితఖైదు విధించడం సరైనదే. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరాలి. ఇకపోతే రేవణ్ణ కేసులు చూస్తే ఆశ్చర్యం కలగమానదు. ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారం జరిపిన కేసులో అభియోగాలు రుజువు కావడంతో మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు బెంగళూరు ప్రజాప్రతినిధుల న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్‌ను దోషిగా నిర్ధారించిన కోర్టు, యావజ్జీవంతోపాటు 11.35 లక్షల రూపాయలు జరిమానా విధించి, దానిలో 11 లక్షలు బాధితురాలికి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మహిళలను కట్టుబానిసలుగా, వారిని సెక్స్ వర్కర్లుగా చూస్తున్న ప్రస్తుత సమయంలో న్యాయస్థానం వెలువరించిన ఈ తీర్పు మహిళలకు ఆశాకిరణం. రోజురోజుకు స్త్రీలపై అఘాయిత్యాల పరంపర కొనసాగుతున్న వేళ మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపిందనే చెప్పాలి. ప్రజ్వల్‌పై మూడు లైంగిక దాడి కేసులు, ఒక లైంగిక వేధింపుల కేసు నమోదుకాగా మొదటి కేసులోనే శిక్ష





పడింది. మిగతా కేసులు విచారణలో ఉన్నాయి. మైసూర్ ఆర్‌కె నగర్‌కు చెందిన ఒక మహిళ తనపై ఫాంహౌస్‌లో ప్రజ్వల్ పలుమార్లు అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేయడంతో తొలికేసు నమోదైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో రెండవ తడవ హసన్ నియోజకవర్గం నుంచి ప్రజ్వల్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేశారు. పోలింగ్ ముగిశాక కేసు నమోదు కావడంతో జర్మనీకి పారిపోయాడు. ప్రత్యేక దర్యాప్తు బృందం అతన్ని
స్వదేశానికి రప్పించి గతేడాది మే 31న అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి రిమాండ్ ఖైదీగా ప్రజ్వల్ జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. కేసు దర్యాప్తు సమయంలో సిట్ కనుగొన్న విషయాలు విస్తుగొల్పేలా ఉన్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ ప్రజాప్రతినిధిగా సమస్యలపై తన దగ్గరకొచ్చే మహిళలపై లైంగికదాడికి ఒడిగట్టాడు. బెదిరించో బలవంతంగానో లోబరుచుకునో లైంగిక దాడులకు బరితెగించాడు. అత్యాచారం చేసిన ప్రతిసారీ తన ఐ-ఫోన్‌లో ఆ దృశ్యాలను తానే రికార్డు చేసుకున్నాడు. అటువంటి రెండు వేలకు పైచిలుకు వీడియోల ను దర్యాప్తు సందర్భంగా ప్రజ్వల్ ఫోన్‌లో కనుగొన్నారు. అవి మార్ఫింగ్ వీడియోలుగా, రాజకీయ కుట్రగా ప్రజ్వల్ బుకాయించి,తప్పించుకోచూశాడు. అయితే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీడియోలను విదేశాలకు పంపి, ఫోరెన్సిక్ పరీక్షలు చేయించి నిజమైనవేనని నిర్ధారించారు. కేవలం 14 మాసాల్లోనే కేసు ఛేదించడం వెనుక దర్యాప్తు అధికారుల కృషి, కోర్టులో వాదనల సందర్భంగా ప్రాసిక్యూషన్ కనబరిచిన చాకచక్యం అభినందించాల్సిందే. ఇవన్నీ కలిసి ప్రజ్వల్‌ను బోనులో దోషిగా నిలబెట్టాయి. అన్నింటికీ మించినది న్యాయం కోసం, దోషికి శిక్ష పడాలని బాధితురాలు కనబర్చిన పట్టుదల మహిళాలోకానికి స్ఫూర్తినిస్తుంది. ప్రజ్వల్ రేవణ్ణ సాదాసీదా యువకుడు కాదు. కర్ణాటక రాజకీయాలను శాసిస్తున్న కుటుంబానికి చెందిన మాజీ ఎంపి. ఆయన తాత దేవెగౌడ మాజీ ప్రధాని, పినతండ్రి కుమార స్వామి కేంద్ర మంత్రి, తండ్రి మాజీ రాష్ట్ర మంత్రి, ప్రస్తుత ఎంఎల్ఎ హెచ్‌డి రేవణ్ణ, తల్లి భవానీ గతంలో కార్పొరేటర్, సోదరుడు సూరజ్ ఎంఎల్ఎ. ఇంతమంది రాజకీయ కుటుంబంలో ఉన్న ప్రజల్వల్ తనకు తిరుగులేదని భావించాడు. అత్యాచార బాధితురాలిని అపహరించిన ప్రజ్వల్ తల్లి భవానీపైనా కేసు , ప్రజ్వల్ తండ్రి హెచ్‌డి రేవణ్ణపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణల కేసు నమోదయ్యాయంటే బాధితులను ప్రజ్వల్ కుటుంబం తమ రాజకీయ పలుకుబడితో ఏ స్థాయిలో భయభ్రాంతులకు గురి చేసిందో తెలుస్తుంది. అయితే పాపం పండింది. ప్రజ్వలు ఎంతగా మొత్తుకున్నా సాక్ష్యాలు బలంగా ఉన్నాయి. అత్యాచారాలు చేసి పైశాచికానందం పొంది, వాటిని సెల్ ఫోన్లలో వీడియోలు తీసి మురిసి పోయిన ప్రజ్వల్ లాంటి వారికి జీవిత ఖైదు సరిపోదు. అలాగే ధర్మస్థలిపైనా నిజాయితీగా విచారణ జరగాలి. అప్పుడే ప్రజల్లో భరోసా వస్తుంది. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్దని చాటుకోవడానికి ఇదో మంచి అవకాశం. రాజ్యాంగం పుస్తకాన్నిపట్టుకు తిరుగుతున్న రాహుల్ ఈ విషయంలో తమ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ధర్మస్థలి విషయంలోనూ నిగ్గు తేలేలా చేస్తే మంచిది.

# ఢిల్లీలో టెస్లా రెండో అడుగు

## ముంబై తరవాత ప్రారంభానికి సిద్దం -11న షోరూమ్ ప్రారంభానికి నిర్ణయం



**న్యూఢిల్లీ,ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి ఇప్పటికే అడుగుపెట్టింది. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైంది. దేశ రాజధాని ఢిల్లీలో తన సెకెండ్ షోరూంను తెరవబోతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీలో టెస్లా సెకెండ్ షోరూంను ఆగస్టు 11న ఓపెన్ చేయనుంది. ఇందుకోసం వరల్డ్‌మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు- తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది . రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. అయితే టెస్లాపై మోజుతో ఇండియాలో మార్కెట్ పెరుగుతందని భావిస్తున్నారు.

# అద్వానీ రికార్డు బ్రేక్

## అత్యధిక కాలం హోంమంత్రిగా అమిత్ షా



**న్యూఢిల్లీ,ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించినట్లుగానే హోంమంత్రి అమిత్ షా కూడా అత్యధిక కాలం హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998-1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీకేంద్ర హోం మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హోం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపుతున్నారు. మొత్తంగా అమిత్ షా అత్యధిక కాలం హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పాలరు.

----------------

# పత్రికలు సమాజానికి దర్పణం లాంటివి

## మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి -'విలీనం-విభజన' పుస్తకావిష్కరణలో వెంకయ్యనాయుడు

**హైదరాబాదంఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** పత్రికలు సమాజానికి దర్పణం లాంటివని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని అవినీతిని ప్రజలకు జర్నలిస్టులు వివరించాలి. నిజాన్ని తెలియజేసి తీర్పును ప్రజలకే వదిలేయాలి. మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి. గతంలో బూతులు మాట్లాడిన నేతలు ఎవరూ గెలవలేదు. అలాంటి వారిని నిలువరించాలని ఓ మహిళ నాతో అన్నారు. పోలింగ్‌బూత్‌ల ద్వారా బూతు నేతల నోరు మూయించాలని ఆమెకు చెప్పానని వెంకయ్యనాయుడు అన్నారు. భాష విషయంలో నాయకుల తీరు మారాలని వెంకయ్యనాయుడు సూచించారు. సీనియర్ సంపాదకులు ఐ.వెంకట్రావు రాసిన విలీనం-విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక



రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మీడియాతో మాట్లాడారు. విలీనం - విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకాన్ని నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. పత్రికా సమాజానికి దర్పణం లాంటిదని... ఈ సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు. మనం వ్యూస్ కోసం న్యూస్ చేయకూడదని.. దానికోసమే కాలమ్స్ ఉన్నాయని, రాసుకోవడానికి అందులో వాళ్ల అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. భాష విషయంలో రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. చాలా మంది జర్నలిస్టులు కొత్తగా యూట్యూబ్‌లో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని.. పాత్రికేయంలో భాష చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు వెంకయ్యనాయుడు. తన జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని గుర్తుచేసుకున్నారు. ఒకటి తన అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు... తాను తన అమ్మను చూడలేదని భావోద్వేగానికి గురయ్యారు. రెండోది పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి తనను ఉప రాష్ట్రపతిగా చేసినప్పుడు...తనకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదని తెలిపారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు తాను బీజేపీ ఆఫీస్‌కు పోలేదని వెల్లడించారు. తాను ఉప రాష్ట్రపతిగా దిగిపోయిన నాటి నుంచి ఇప్పటి వరకు బీజేపీ ఆఫీస్ గుమ్మం తొక్కలేదని చెప్పుకొచ్చారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# బీహార్ ఓటు సవరణపై నిరసనలు


## పార్లమెంట్ ముందు ఇండియా కూటమి ఆందోళన



**న్యూఢిల్లీ,ఆగస్టు 05 ఆంధ్ర ప్రగతి :** బీహార్‌లో ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పలువురు ఇండియా బ్లాక్ నేతలు పార్లమెంటులో నిరసన చేపట్టారు. ఎస్‌ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరుసగా పదవరోజైన మంగళవారం కూడా ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. పార్లమెంట్ మకరద్వారం సమీపంలో చేపట్టిన నిరసనలో వామపక్షాలు, డిఎంకె, టిఎంసి ఎంపిలు సహా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలు పాల్గొన్నారు. 'మన ఓటు-. మన హక్కు. మన పోరాటం', 'ఎస్‌ఐఆర్- సైలెంట్ ఇన్విజబుల్ రిగ్గింగ్' అని రాసి వున్న బ్యానర్లు ప్రదర్శించారు. 'స్టాప్ ఎస్‌ఐఆర్' ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శించడంతో పాటు- పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఓటర్ల ఓటు- హక్కును తొలగించడం లక్ష్యంగా ఇసిఐ కసరత్తు చేపడుతోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎస్‌ఐఆర్‌పై చర్చ చేపట్టాలంటూ పార్లమెంట్ ఉభయ స భల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మరణించడంతో సోమవారం ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టలేదు.

# విశ్వంభరలో ఆషిక పోస్టర్ విడుదల




మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న భారీ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ మూవీ 'విశ్వంభర'. యంగ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ డ్రామా, ఇప్పటివరకు వచ్చిన ప్రతి అప్డేట్‌తో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ నుంచి స్పెషల్ ట్రీట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఆషిక రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌కి వచ్చిన స్పందన చూస్తుంటే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. పోస్టర్ అదిరిపోయింది, ఆషిక కళ్ళలో మ్యాజిక్ ఉంది, విశ్వంభరకు మరో హైలైట్ ఆమె అవుతుందని ఫిక్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందాన్ని, క్యారెక్టర్ డెప్త్‌ను హైలైట్ చేస్తోంది. చిరు సరసన త్రిషతో పాటు–, సెకండ్ హీరోయిన్ ఈ కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ నటిస్తోంది. ఈ సినిమాను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్న యూవీ క్రియేషన్స్, ప్రమోషనల్ స్ట్రాటజీలో కూడా కొత్తదనం చూపించబోతున్నారు. బర్త్ డే పోస్టర్‌తో మొదలైన ఈ ప్రమోషన్ రన్ ఇక నుంచి రెగ్యులర్‌గా సాగనుందని సమాచారం. భారీ సెట్‌లు, విజువల్ ఎఫెక్ట్స్, మైథలాజికల్ టచ్‌తో కూడిన ఈ సినిమాను వినాయక చవితి లేదా దసరా సీజన్లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అంతే కాదు ఎం.ఎం.కీరవాణి అందిస్తున్న సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, రీసెంట్ గా 'హరి హర వీరమల్లు' వంటి సినిమాల్లో తన వర్క్‌కి ఇంటర్నేషనల్ గుర్తింపు తెచ్చుకున్న కీరవాణి.. ఇప్పుడు 'విశ్వంభర'కి సంగీతం అందిస్తుండటంతో మ్యూజిక్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# సినిమా ఫెయిల్యూర్‌కు రివ్యూలు కూడా ఓ కారణం

## హీరోయిన్ మృణాళ్ ఠాకూర్



ఏదైనా ఒక సినిమా వచ్చిందంటే చాలు.. యూట్యూబ్ రివ్యూల, ట్విట్టర్ కామెంట్స్, ఇన్‌స్టా రీల్స్‌తో మైండ్ బ్లాక్ అంటూ ఇష్టం వచ్చిన రివ్యూ ఇస్తున్నారు. అసలు సినిమా ఎలా ఉందో తెలిసేలోపే.. 'ఫ్లాప్', 'ఓవరాక్టింగ్', 'బోర్' అంటూ ట్యాగ్‌లతో దండం పెట్టి ప్రేక్షకుల అభిప్రాయాలను దారి తప్పిస్తున్నారు ఈ ట్రెండ్‌పై ఇప్పటికే పలువురు హీరోలు, నిర్మాతలు నిప్పులు చెరిగారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ– మృణాల్ ఠాకూర్ కూడా ఇదే విషయంపై స్పందించింది. ఇటీవల బాలీవుడ్ లో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' విడుదలైన మిశ్రమ స్పందన అందుకుంది. ఈ క్రమంలో మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ నిర్వహించారు. ఇందులో ఓ అభిమాని.. నేను నెగిటివ్ రివ్యూలు చూసి 'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమా చూడలేదు అంటూ కామెంట్ చేశాడు. దీనిపై ఆమె స్పందిస్తూ.. చాలా రివ్యూలు తప్పుదారి పట్టించేవిగా ఉంటున్నాయి. అందుకే రివ్యూలను నమ్మకుండా, మీరే సినిమా చూసి ఓ అభిప్రాయం ఏర్పరచుకోవాలి. ఒక్కోసారి సినిమా ఫెయిల్యూర్‌కి రివ్యూలే కారణం అవుతాయి అంటూ కుండ బద్దలు కొట్టేసింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రివ్యూలు చూసి ప్రేక్షకులు సినిమాకు వస్తే.. అసలు సినిమా ఆత్మను చూడకముందే దాన్ని ఖండించేసినట్లే అవుతుందని ఇండస్ట్రీలో చాలామంది నిపుణులు కూడా చెబుతున్నారు. అయిన కూడా వారి ఆగడాలు ఆగడం లేదు. ఇక ప్రజంట్ మృణాల్ వరుస చిత్రాలతో బిజీగా గడుపుతున్నారు.

# ఉస్తాద్‌లో పవన్ షెడ్యూల్ పూర్తి




దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడి పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి దర్శకుడు గుడ్‌న్యూస్ చెప్పారు. ఈ సినిమాలో పవన్‌కు సంబంధించిన షెడ్యూల్ పూర్తయినట్లు– తెలుపుతూ ఓ ప్రత్యేక ఫొటో పంచుకున్నారు. ఇటీవలే 'హరిహర వీరమల్లు'తో పలకరించిన పవన్‌కల్యాణ్ అదే జోష్‌తో ఇప్పుడు 'ఉస్తాద్ భగత్‌సింగ్'ను పూర్తి చేశారు. ఆయన సపోర్ట్ వల్లే ఈ షెడ్యూల్ త్వరగా పూర్తయినట్లు– హరీశ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌పై ప్రశంసలు కురిపించారు. మాటిస్తే నిలబెట్టుకోవడం, మాట మీదే నిలబడడం.. మీరు పక్కనుంటే కరెంట్ పాకినట్లే అంటూ ఆయనతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఈ రోజును తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని దర్శకుడు తెలిపారు. పవన్ ఎనర్జీ సినిమాకు మరింత పవర్‌ను ఇచ్చిందన్నారు. సపోర్ట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం హరీశ్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో పవన్ సింపుల్ లుక్‌లో కనిపించడంతో అభిమానులు షేర్ చేస్తున్నారు. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ – హరీశ్‌శంకర్) కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టు–కున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. దేవీశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పవన్ 'ఓజీ'లో నటిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఇది రానుంది.

# భారత్-చైనా యుద్ధం ఆధారంగా 120 బహదూర్





బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం '120 బహదూర్' . 1962లో జరిగిన భారత్–చైనా యుద్ధం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని రజనీష్ దర్శకత్వం వహిస్తుండగా.. పరమ వీర చక్ర పురస్కార గ్రహీత మేజర్ సైతాన్ సింగ్ భాటి పాత్రలో ఫర్హాన్ అక్తర్ నటించబోతున్నాడు. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రం నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. భాగ్ మిల్కా భాగ్ తర్వాత ఫర్హాన్ అక్తర్ మరోసారి బయోపిక్ చేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

-----------------------

# పృథ్వీరాజ్‌ను వదిలి షారూఖ్‌కు అవార్డా

## జాతీయ చలనచిత్ర అవార్డులపై విమర్శలు



జాతీయ చలన చిత్ర పురస్కారాల జాబితాలో ఉత్తమ నటుడి ఎంపికపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. 2023లో విడుదలైన సినిమాలకు గాను ఉత్తమ నటుడుగా బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్, ఉత్తమ సపోర్టింగ్ నటుడిగా విజయ రాఘవన్, బెస్ట్ సినిమాగా భగవంత్ కేసరి సినిమాలు అవార్డ్స్ అందుకున్నాయి. అలాగే వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విజేతలుగా ప్రకటించింది నేషనల్ అవార్డ్స్ జ్యూరీ. అయితే ఈ అవార్డ్స్ నేషనల్ జ్యూరీకి తలనొప్పులు తెచ్చింది. 2023 బెస్ట్ యాక్టర్ గా జావాన్ సినిమాకు గాను షారుక్‌కు ఈ అవార్డు ప్రకటించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అదే ఏడాదిలో మళయాళంలో పృథ్వి రాజ్ సుకుమారన్ హీరోగా ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో పృథ్వి రాజ్ నటనకు అవార్డు దక్కకపోవడంతో జ్యూరీపై విమర్శలు వచ్చాయి. వాస్తవంగా చూస్తే ఆడుజీవితంలో పృద్వి రాజ్ సుకుమారన్ నటన అద్భుతంగా ఉంటుంది. బ్రతుకు తెరువుకు దుబాయ్ వెళ్లిన ఓ సామాన్యుడు అక్కడ ఎడారిలో అనుభవించిన నరకం అనుభవించే క్యారక్టర్ లో పృద్వి రాజ్ అద్భుతంగా నటించాడు. ఇక జవాన్ సినిమాలో షారుక్ నటన గొప్పగా ఏమి ఉండదు. ఓ రొటీన్ రెగ్యులర్ కమర్షియాల్ సినిమాలో ఎలా ఉంటుందో అలా ఉంటుంది. ఈ విషయమై నేషనల్ జ్యూరీని ప్రశించగా జ్యూరీ సభ్యుడు ప్రదీప్ నాయర్ స్పందించారు. ఆడు జీవితంలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటన ఆర్టిఫిషయల్ గా ఉంటుంది. సహజత్వ లేదని జ్యూరీ ఛైర్‌పర్సన్ అశుతోష్ గోవారికర్ తో పాటు సహ జ్యూరీ సభ్యులు పలువురు భావించడంతో పృథ్వీరాజ్ కు అవార్డు దక్కలేదని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై నెటిజన్స్ ఫైర్ అవుతున్నారు. స్వప్రయోజనాల ముందు ఎంతటి అద్భుతమైన నటన కనబరించిన ఇలానే ఉంటుందని కామెంట్స్ వినిపిస్తున్నాయి.


# నిజాయతీ గల వ్యక్తిగా నన్ను గుర్తిస్తే చాలు

**: జూనియర్ ఎన్టీఆర్**



'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో మార్కెట్ పెంచుకున్న జూనియర్ ఎన్టీఆర్... ఇప్పుడు 'వార్ 2'తో బాలీవుడ్ లోకి డైరెక్ట్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఈ సినిమా ఈనెల 14న రిలీజ్ కాబోతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తారక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమాలకు సంబంధించి... కుటుంబ వారసత్వం విషయంలో ఏం జరుగుతుందో తనకు తెలియదని, తాను ఎలాంటి ప్లాన్స్ వేసుకోలేదని చెప్పాడు. అయితే తాను నటించే చిత్రాలతో తనను గుర్తుంచుకోవాలనే ప్రయత్నం మాత్రం చేస్తానని తెలిపాడు. ఒక నటుడిగా కంటే ఒక నిజాయతీ గల మనిషిగా తనను గుర్తించాలని కోరుకుంటున్నట్టు చెప్పాడు. ఎమోషన్స్ తో కూడిన నిజాయతీ గల వ్యక్తిగా తనను గుర్తిస్తే చాలని తెలిపాడు.

# వార్ 2 పాట కోసం కియారా హొయలు



హృతిక్ రోషన్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో రూపొందిన 'వార్ 2' సినిమా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధంగా ఉంది. ఎన్టీఆర్ ఈ సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం వల్ల అంచనాలు భారీగా పెరిగిన విషయం తెల్సిందే. ముఖ్యంగా తెలుగు మార్కెట్‌లో వార్ 2 కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అత్యధిక స్క్రీన్స్‌లో ఈ సినిమాను రిలీజ్ చేయడం కోసం సితార నాగవంశీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. వార్ 2 సినిమాలో హీరోయిన్‌గా నటించిన కియారా అద్వానీ ప్రెగ్నెన్సీ కారణంగా ప్రమోషన్స్‌కి హాజరు కాలేక పోయింది. కానీ ఆమె సోషల్ మీడియా ద్వారా తనవంతుగా వార్ 2 కి ప్రమోషన్ చేస్తూనే ఉంది. వార్ 2 లోని ఆవన్ జావన్ పాట గురించి ప్రస్తుతం చర్చ జరుగుతున్న విషయం తెల్సిందే. %ూశ్రీంశీ =ముృ% - స్టార్ హీరోల పాలిట స్వేచ్ఛాయుత డైరెక్టర్! హృతిక్ రోషన్‌కి జోడీగా కియారా అద్వానీ ఆవన్ జావన్ లో కియారా అద్వానీ, హృతిక్ రోషన్ కాంబో ఉంటుంది. ఇద్దరి డాన్స్‌కి ప్రేక్షకులు ఖచ్చితంగా ఫిదా అవుతారు అంటూ మేకర్స్ చెబుతున్నారు. అన్నట్లుగానే కియారా అందంతో పాటు, మేకింగ్ విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. కియారా అద్వానీ ఆవన్ జావన్ లో ఎలా కనిపించింది క్లారిటీ ఇచ్చింది. ఆ పాట కోసం ధరించిన ఔట్ ఫిట్ ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. పొట్టి డ్రెస్‌లో కియారా అద్వానీ భలే అందంగా ఆకట్టుకునే విధంగా ఉంది. చాలా స్మూత్ లుక్‌లో కియారా అద్వానీ ఆకట్టుకుంది. వార్ 2 సినిమాలో కియారా బికినీ ట్రీట్ ఉండబోతున్న విషయం తెల్సిందే. బికినీ ఫోటోల ముందు ఇవి పెద్దగా ప్రేక్షకులకు నచ్చుతాయా అని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. కానీ పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. %ూశ్రీంశీ =ముృ% - కూలీ ఇంటర్వెల్ పై నెక్స్ట్ లెవెల్ ఎలివేషన్లు వార్ 2 తో కియారా అద్వానీ స్టార్‌డం రెట్టింపు కియారా అద్వానీ ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పటి నుంచి కష్టపడుతూ వచ్చింది. ఓవర్ నైట్‌లో కియారా స్టార్‌డం దక్కించుకోలేదు. సినిమా సినిమాకు క్రేజ్ పెరిగింది. ఆమె స్టార్‌డం పెంచుకుంటూ పోయింది. ఇప్పుడు కియారా అద్వానీ యొక్క స్టార్‌డం ముందు చాలా మంది హీరోయిన్స్ సైతం నిలబడలేని పరిస్థితి. ఆమె వార్ 2 తర్వాత మరింతగా టాప్ రేంజ్‌కి వెళ్తుందనే ఉద్దేశంతో కావాలని కొందరు ఆమెపై నెగటివ్ ప్రచారం చేస్తున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఇండస్ట్రీలో కియారా అద్వానీ ఇలా అందంగా, నటనతో మెప్పించడం వల్ల ఎన్ని ట్రోల్స్ వచ్చినా, నెగటివ్ ప్రచారం జరిగినా కూడా తట్టుకుని నిలదొక్కుకుంటుంది. అంతే కాకుండా చాలా నమ్మకంగా ఆమె ఇండస్ట్రీలో ముందుకు సాగుతుంది. %ూశ్రీంశీ =ముృ% - 'విశ్వంభర'కు విత్తనం అలా! అయాన్ ముఖర్జీ దర్శకత్వంపై నమ్మకం వార్ 2 సినిమా విషయానికి వస్తే మరో వారం రోజుల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఎన్టీఆర్ మొదటి సారి హిందీ సినిమాను చేయడంతో పాటు, హృతిక్ రోషన్ వంటి సూపర్ స్టార్‌తో స్క్రీన్ ను షేర్ చేసుకోవడం వల్ల అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా అయాన్ ముఖర్జీ ఈ సినిమాను రూపొందించాడని ట్రైలర్ ను చూస్తే అర్థం అవుతుంది. టీజర్‌కి నెగటివ్ టాక్ వచ్చినప్పటికీ, ట్రైలర్ వచ్చిన తర్వాత మొత్తం పరిస్థితి మారిపోయింది. సినిమాకు అడ్వాన్స్ బుకింగ్ షురూ అయ్యాయి. అయితే రజనీకాంత్ కూలీ సినిమా వల్ల ఈ సినిమాకు చాలా పెద్ద డ్యామేజీ ఉండే అవకాశం ఉందని బాక్సాఫీస్ వర్గాల వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఓపెనింగ్ విషయంలో కూలీ ని వార్ 2 బీట్ చేస్తుందనే నమ్మకంను హృతిక్, ఎన్టీఆర్ ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు.